ఆంధ్రజ్యోతి
3
ANDHRAJYOTHY
అనకాపల్లి
జిల్లా వార్తలు
బుధవారం 3 డిసెంబరు 2025



చెరకు పరిశోధకులకు జాతీయ సదస్సులో ప్రశంసలు
- బెల్లం ఆధారిత ఉత్పత్తుల పరిశీలనకు త్వరలో వస్తామని ప్రముఖుల వెల్లడి
- బోదెలను ఎగదోసే యంత్రాన్ని రూపొందించిన శాస్త్రవేత్త ఆదిలక్ష్మికి అభినందన - 8లో

ప్రభుత్వ భూముల్లో పాగా

- తొలుత జిరాయితీ భూమి కొనుగోలు
- అనంతరం పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణ
- స్థానికులు ప్రశ్నిస్తే.. తమ భూమేనంటూ బుకాయింపు
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

కొండ పోరంబోకు, గెడ్డ వాగులను సైతం వదలని కబ్జాదారులు



మునగపాక మండలం నరేంద్రపురంలో రియల్టర్ కబ్జా చేసిన ప్రభుత్వ కొండపోరంబోకు భూమి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. కొంతమంది వ్యక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు.. వ్యూహాత్మకంగా ప్రభుత్వ భూములకు సమీపంలో జిరాయితీ భూములను కొనుగోలు చేసి, తరువాత పక్కనే వున్న ప్రభుత్వ భూములను ఆక్రమించేస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

గత వైసీపీ హయాంలో ఖాళీగా వున్న ప్రభుత్వ భూములను ఆ పార్టీకి చెందిన కొంతమంది నాయకులు, వారి అండదండలతో రియల్టర్లు దర్జాగా ఆక్రమించుకున్నారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కొంతకాలంపాటు స్తబ్దుగావున్న వారు.. మళ్లీ భూకబ్జాలకు తెగబడుతున్నారు. అనకాపల్లి, ఎలమంచిలి నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో ప్రభుత్వ భూములు ఎక్కువగా అన్యాక్రాంతమవుతున్నాయి. ముఖ్యంగా అనకాపల్లి, కశింకోట మండలాల్లో భూముల ధరలు గణనీయంగా పెరిగాయి. దీంతో కబ్జాదారులు ప్రభుత్వ భూములపై గద్దల్లా వాలిపోతున్నారు. అనకాపల్లి మండలం తుమ్మపాల



అనకాపల్లి మండలం సత్యనారాయణపురంలో ప్రభుత్వ వాగు గట్టుపై ప్రహరీ గోడ నిర్మాణం

రెవెన్యూ పరిధిలోని సత్యనారాయణపురంలో ఆర్డీఓ కార్యాలయానికి కూతవేటు దూరంలో వున్న ప్రభుత్వ వాగు భూమిని కొంతమంది ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మిస్తున్నారు. అనకాపల్లి నుంచి కూండ్రం, కుంచంగి మీదుగా బుచ్చెయ్యపేట వెళ్లే ప్రధాన రహదారి పక్కన కావడంతో ఇక్కడ సెంటు భూమి రూ.10 లక్షలు పలుకుతున్నది. దీంతో సత్యనారాయణపురం టిడ్కో కాలనీకి వెళ్లే మట్టి రోడ్డును ఆనుకొని ఉన్న సర్వే నంబరు 388-2లో సుమారు 10 సెంట్ల ప్రభుత్వ వాగు భూమిని స్థానికులు కొందరు ఆక్రమించి గోడ కడుతున్నారు. కానీ స్థానిక రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదే భూమిని గతంలో కొంతమంది వైసీపీ నాయకులు తెర వెనుక ఉండి ఆక్రమించే ప్రయత్నం చేయగా.. స్థానికుల ఫిర్యాదుతో అప్పట్లో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఇటీవల ఇదే వాగు భూమిని కొందరు చోటా నాయకుల అండదండలతో ఆక్రమించి గోడ కడుతున్నారు. రెవెన్యూ ఉన్నతాధికారులు తరచూ రాకపోకలు సాగించే మెయిన్ రోడ్డు పక్కన వున్న ప్రభుత్వ వాగు భూమిని ఆక్రమించినప్పటికీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

మునగపాక మండలం నరేంద్రపురంలో సర్వే నంబరు 17లో రైతుల జిరాయితీ భూములను ఇటీవల ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి కొనుగోలు చేశారు. అనంతరం పక్కనే వున్న 19వ సర్వే నంబరులో దాదాపు ఎకరం ప్రభుత్వ కొండపోరంబోకు భూమిని కబ్జా చేశారు. తన భూమితోపాటు దీనిని కూడా చదును చేసేందుకు సిద్ధపడగా.. స్థానికులు ప్రశ్నించారు. ఈ భూమి కూడా తనదేనని బుకాయించినట్టు తెలిసింది.

పేదల ఇళ్ల కాలనీల్లో...

గత ప్రభుత్వం పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం పలు గ్రామాల్లో లేఅవుట్లు వేసింది. అనంతరం లబ్ధిదారులకు ... మిగతా 6వ పేజీలో

రూటు మారిన గంజాయి

అడ్డదారుల్లో రవాణా చేస్తున్న స్మగ్లర్లు

- పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకోవడానికి సరికొత్త ఎత్తుగడ
- ఏజెన్సీని ఆనుకొని ఉన్న చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల మండలాలకు తరలింపు
- అక్కడ నుంచి కార్లు, ఆటోల్లో ఇతర ప్రాంతాలకు రవాణా
- మరిన్ని చెక్‌పోస్టులతోనే గంజాయి రవాణాకు అడ్డుకట్ట



ట్రాక్టర్‌లో రవాణా చేస్తుండగా చోడవరం పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్ ఫొటో)

చోడవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):

'శత కోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు' అన్నట్టు గంజాయి రవాణాదారులు, పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకోవడానికి రోజుకో కొత్త మార్గాన్ని ఎంచుకుంటున్నారు. గంజాయి సాగు, రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేసే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగల్ సెల్‌ను ఏర్పాటు చేయగా.. అక్రమార్కులు ఏజెన్సీ నుంచి దొడ్డిదారిని గంజాయిని మైదాన ప్రాంతానికి తరలించి నిల్వ చేస్తున్నారు. వీలు చిక్కినప్పుడల్లా ఇక్కడి నుంచి గమ్యస్థానాలకు రవాణా చేస్తున్నారు.



ఇటీవల చోడవరం పోలీసులు పట్టుకున్న గంజాయి రవాణాదారులు

గత కొద్దిరోజులుగా అక్రమార్కులు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని తరలిస్తూ చోడవరం పోలీసులకు పట్టుబడుతున్నారు. గంజాయి రవాణాదారుల్లో కొంతమంది మరింత బరితెగిస్తున్నారు. పోలీసులను చూసి వాహనాలను ఆపకుండా దూకుడుగా ముందుకు పోనిస్తున్నారు. ఈ క్రమంలో రహదారిపై వున్న వారిని ఢీకొట్టి మరీ పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నారు. చోడవరంలో గత నెల 21వ తేదీన గంజాయి స్మగ్లర్లు పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో కారును వేగంగా నడిపి, వాహనాలపైకి దూసుకెళ్లారు. ఈ ఘటనలో భార్యాభర్తలు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. స్మగ్లర్ల కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఆగిపోయింది. ఇందులో వున్న ఇద్దరు పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారులో వున్న 240 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చోడవరంలో పోలీసుల నిఘా, తనిఖీలు అధికం కావడంతో గంజాయి స్మగ్లర్లు కొత్త దారులను వెతుక్కుంటున్నారు. ప్రధాన మార్గాల్లో కాకుండా, నడకదారిన గంజాయిని తీసుకువస్తున్నారు. దీంతో ఆయా మార్గాల్లో కూడా పోలీసులు నిఘా పెట్టాల్సిన అవసరం ఏర్పడింది.

ప్రత్యామ్నాయ మార్గాల్లో రవాణా

వాస్తవానికి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నుంచి వచ్చే మైదాన ప్రాంతానికి వచ్చే మార్గంలో మాడుగుల సమీపంలోని గరికబంద వద్ద మాత్రమే చెక్‌పోస్టు ఉంది. ఇది దాటితే మరెక్కడా తనిఖీలు లేవు. గంజాయి రవాణాపై ముందస్తు సమాచారం అందితే సంబంధిత మార్గంలో పోలీసులు వాహనాలను ... మిగతా 6వ పేజీలో

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి జల్లులు

రబీ వరి సాగుకు అనువైన రకాలను ఎంచుకోవాలి

- మొక్కజొన్నలో హైబ్రిడ్ రకాలు మేలు
- రాగిలో ఇంద్రావతి, వేగావతి అనువైనవి
- వరి మాగాణుల్లో పెసర, మినుము సాగు
- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ముకుందరావు



అనకాపల్లి అగ్రికల్చర్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. మంగళవారం ఆర్ఏఆర్ఎస్‌లో జరిగిన వాతావరణ ఆధారిత వ్యవసాయం కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 27.1 నుంచి 28.5 డిగ్రీల వరకు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18.3 నుంచి 22.2 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం వుందన్నారు. ఈ సందర్భంగా రబీలో సాగుచేసే వరి, అపరాలు, మొక్కజొన్న, రాగి, కూరగాయ పంటల గురించి ఆయన పలు వివరాలను వెల్లడించారు.

రబీలో సాగుకు ఎంటీయూ 1121, ఎంటీయూ 1153, ఎంటీయూ 1156, ఎంటీయూ 1293, ఎస్ఎల్ఆర్ 3238, బీపీటీ 2411, ఎన్ఎల్ఆర్ 3354 వంటి వరి రకాలు అత్యంత అనుకూలం. ఎకరాకు 20-25 కిలోల విత్తనం అవసరం. నారుమడి కోసం ఐదు సెంట్ల స్థలాన్ని సిద్ధం చేసుకొని రెండు కిలోల యూరియా, ఆరు కిలోల సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్, రెండు కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. నారుమడిలో జింకు లోపం గమనిస్తే.. లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పున జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలి. ఇనుముధాతు లోపం నివారణకు లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున అన్నబేది, ఒక గ్రాము నిమ్మఉప్పు కలిపి పిచికారీ చేయాలి.

మొక్కజొన్న సాగు చేయాలనుకునే రైతులు అధిక దిగుబడినిచ్చే హైబ్రిడ్ రకాలను ఎంపిక చేసుకోవాలి. ఎకరాకు ఎనిమిది కిలోల విత్తనం సరిపోతుంది. నాటేముందు కాప్టన్ లేదా మాంకోజెబ్ మందు కిలో విత్తనాలకు మూడు గ్రాముల చొప్పున కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. విత్తిన 20 రోజుల వరకు కత్తెర పురుగు ఆశించకుండా ఉండేందుకు కిలో విత్తనానికి ఆరు మిల్లీ లీటర్ల సైయాంత్రినిలిప్రోల్, థయోమిథాక్సాం మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి. కలుపు నివారణకు విత్తిన మూడు రోజుల లోపు అట్రాజిన్ మందును లీటరు నీటికి ఐదు గ్రాములచొప్పున కలిపి పిచికారీ చేయాలి.

రాగిలో కొత్తగా వచ్చిన ఇంద్రావతి, వేగావతి వంటి రకాలను ఎంపిక చేసుకోవాలి. ఎకరానికి 2.5 కిలోల చొప్పున విత్తనం తీసుకొని నారుమడిలో చల్లాలి. నెల రోజులు పెరిగిన తరువాత ప్రధాన పొలంలో నాటుకోవాలి.

వరి మాగాణుల్లో రబీ పంటగా అపరాలు వేసే రైతులు పెసరలో ఎల్‌జీజీ 630, ఎల్‌జీజీ 600, ఎల్‌జీజీ 607, ఐపీఎం 2-14 వంటి రకాలను ఎంపిక చేసుకోవాలి. ఎకరాకు 12-13 కిలోల విత్తనం అవసరం. మినుము సాగు చేసేటట్టయితే ఎల్‌బీజీ 884, ఎల్‌బీజీ 904, ఎల్‌బీజీ 752, జీబీజీ 1, టీబీజీ 104 వంటి రకాలు అనువైనవి. ఎకరాకు 16-18 కిలోల చొప్పున విత్తనం అవసరం. నాటే ముందు కిలో విత్తనానికి కాప్టన్ 2.5 గ్రాములు, ఇమిడాక్లోప్రిడ్ ఐదు మిల్లీలీటర్ల చొప్పున కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి.

చెరకు మొక్క తోటల కంటే ముందు కార్శీ తోటలను నరకాలి. బెల్లం తయారుచేసే రైతులు చెరకును మొదలకంటా నరకాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో తీగజాతి కూరగాయ పంటలను బూజు తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణ కోసం లీటరు నీటికి మెటలాక్సిల్ రెండు గ్రాములచొప్పున కలిపి పిచికారీ చేయాలి.

ఉపమాక క్షేత్రంపై టీటీడీ చిన్నచూపు

స్వాధీనం చేసుకొని దశాబ్దం దాటినా దశ మారని ఆలయం

- ఉత్సవాలకు నిధుల కేటాయింపులో అలసత్వం
- టీటీడీ చైర్మన్, ఈవోలకు హోం మంత్రి అనిత విజ్ఞాపనలు
- ఆరు నెలలు దాటినా అతీగతీలేని వైనం



ఉపమాక క్షేత్రం

నక్కపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):

కూటమి పాలనలో పాయకరావుపేట నియోజకవర్గం అభివృద్ధి వైపు పయనిస్తోంది. విశ్వవ్యాప్తంగా ఉక్కు ఉత్పత్తిలో అగ్రగామిగా వున్న 'ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్స్' సంయుక్తంగా భారీ ఉక్కు పరిశ్రమను నక్కపల్లిలో ఏర్పాటు చేయనున్నాయి. ఇదే మండలంలో మహిళలకు ఉపాధి కల్పించేందుకు బొమ్మల పరిశ్రమను ఏర్పాటు కానున్నది. త్వరలో నక్కపల్లి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటవుతున్నది. కానీ వందల ఏళ్ల చరిత్ర వున్న ఉపమాక వేంకటేశ్వరస్వామి క్షేత్రం మాత్రం కనీసస్థాయిలో అభివృద్ధికి నోచుకోవడంలేదని భక్తులు ఆవేదన చెందుతున్నారు.

తెలుగుదేశం పార్టీ గతంలో అధికారంలో వున్నప్పుడు 2015 నవంబరు 18న ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని తిరుమల తిరుపతి దేవస్థానాలు (టీటీడీ) స్వాధీనపరుచుకుంది. తరువాత 2016, 2017లో ఉపమాక శ్రీవారి వార్షిక కల్యాణోత్సవాల్లో టీటీడీ ఉన్నతాధికారులు హడావిడి చేశారు. జేఈవో స్థాయి అధికారి వచ్చి ఉత్సవాలను పర్యవేక్షించారు. స్వామివారి కల్యాణానికి ఒక షెడ్డు, భక్తుల వివాహాలకు అరకొర సదుపాయాలతో మరో షెడ్డు, రథం ఉంచడానికి చిన్న రేకుల షెడ్డు, కొండపైకి రెయిలింగ్ వంటి చిన్నాచితకా పనులు మాత్రమే చేయించారు. ఆ తరువాత ఉపమాక వెంకన్నపై శీతకన్ను వేశారు. వైసీపీ హయాంలో టీటీడీ అప్పటి చైర్మన్ సుబ్బారెడ్డి, జేఈవో వీరబ్రహ్మం వేర్వేరుగా ఇక్కడకు వచ్చి పరిశీలించారు తప్ప.. ఆలయం అభివృద్ధి గురించి పట్టించుకోలేదు.



ఆలయ అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకి అందించి, ఆయనతో మాట్లాడుతున్న మంత్రి అనిత (ఫైల్ ఫొటో)

గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే, హోం మంత్రి అయిన అనిత.. ఉపమాక ఆలయంలో నెలకొన్న సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవోలకు స్వయంగా అందించారు. తన నియోజకవర్గంలో వున్న ఏకైక ప్రాచీన పుణ్యక్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. దీంతో ఆరు నెలల కిందట టీటీడీ పాలకమండలి సమావేశంలో ఉపమాక ఆలయం అభివృద్ధి విషయమై చర్చించి తీర్మానం చేశారు. కానీ ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

ఉత్సవాలకు కొర్రీ

ఉపమాక క్షేత్రంలో ఎన్నో విశిష్టమైన ఉత్సవాలు, తిరువీధి సేవలు నిర్వహించడం ఆనవాయితీ. బ్రహ్మోత్సవాల సమయంలో పది రోజులు తిరువీధి సేవలు, విశిష్ట ఉత్సవాలు, వార్షిక కల్యాణ సమయంలో రథోత్సవాలు, స్వామివారి కల్యాణం, చక్రస్నానం, తోట ఉత్సవం, ధనుర్మాసం నెల రోజులు పలు వాహనాలపై తిరువీధి సేవలు, క్షీరాబ్ది ద్వాదశినాడు పుష్కరిణిలో తెప్పోత్సవం, శ్రావణమాసంలో వచ్చే శుక్రవారాల్లో అమ్మవారి తిరువీధి సేవలు వంటివి జరుగుతాయి. ఇవిగాక సీతారామ కల్యాణం, కృష్ణాష్టమి వేడుకలు కూడా జరుగుతాయి. కానీ ఈ ఉత్సవాలకు సంబంధించి ముందుగా టీటీడీ నుంచి అనుమతులు రాకపోవడంతో ఏమీ చేయలేని స్థితిలో కొన్ని సేవలను చేయలేక ... మిగతా 6వ పేజీలో

పోలీసులు స్థానికంగా ఉండాలి

- పెండింగ్ కేసులు త్వరితగతిన క్లియర్ చేయాలి
- ఎస్పీ తుహిన్‌సిన్హా
- 'పేట' పోలీసు స్టేషన్ సందర్శన



పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

పాయకరావుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో భాగంగా పోలీసులు స్థానికంగా వుండి, ప్రజలకు సేవలు అందించాలని ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు, శాంతి భద్రతలు, సమస్యాత్మక గ్రామాల్లో పరిస్థితుల గురించి నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జి.అప్పన్నబాబులను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన క్లియర్ చేయాలని ఆదేశించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని, గంజాయి వినియోగం, రవాణాలను అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని, చోరీలు జరగకుండా గట్టి నిఘా ఏర్పాటుచేయాలని సూచించారు. రాత్రిపూట గస్తీ నిర్వహించే సిబ్బంది రేడియం స్టికర్ జాకెట్లు, హెల్మెట్లు తపనిసరిగా ధరించాని ఎస్పీ ఆదేశించారు.

రాచపల్లి రైతులకు ఊరట

ఏపీఐఐసీ రికార్డుల నుంచి జిరాయితీ భూముల తొలగింపు

- 246 మంది రైతులకు చెందిన 186.14 ఎకరాలకు త్వరలో పట్టాదారు పాస్‌పుస్తకాలు
- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం/ మాకవరపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):

మాకవరపాలెం మండలం రాచపల్లి రెవెన్యూ పరిధిలో 246 మంది రైతులకు సంబంధించి 186.14 ఎకరాల జిరాయితీ భూములను ఏపీఐఐసీ రికార్డుల నుంచి తొలగించామని, ఆయా రైతులకు త్వరలో రెవెన్యూ అధికారులు పట్టాదారు పుస్తకాలు జారీ చేస్తారని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. మంగళవారం నర్సీపట్నంలోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, అల్యూమినియం కంపెనీ కోసం 2012లో ఏపీఐఐసీ సేకరించిన భూములకు సంబంధించిన రికార్డుల్లో అనేక లోపాలు ఉన్నాయని తెలిపారు. పలువురు రైతులకు చెందిన భూములను ఏపీఐఐసీ రికార్డుల్లో నమోదు చేశారని, ఆయా భూములు రైతుల భూముల్లో సాగులో ఉన్నప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఏపీఐఐసీకి చెందినవిగా వున్నాయన్నారు. ఏపీఐఐసీ రికార్డుల నుంచి తమ భూములను తొలగించాలని అప్పటి నుంచి రైతులు కోరుతూనే వున్నారని అన్నారు. రైతుల పేరున పట్టాదారు పాస్‌పుస్తకాలు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు, వడ్డీ ... మిగతా 6వ పేజీలో

మెలిపాకలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో మెలిపాక గ్రామంలో డొంకాలమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మంగళవారం దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానంతో అమ్మవారిని ఎమ్మెల్యే విజయకుమార్‌తో పాటు పలువురు దర్శించుకున్నారు. ఆయన వెంట టీడీపీ నేతలు కొరపాటి వీరరాజశేఖర్, కాండ్రేగుల నాయుడు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మత్స్యకారులకు అన్యాయం

» నాఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు

పాయకరావుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా మత్స్యకారులకు అన్యాయం జరుగుతోందని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పది వేల మంది ఉన్న కులాలకు కూడా కార్పొరేషన్లు ఏర్పాటుచేసిన ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్ర జనాభాలో నాలుగో స్థానంలో ఉన్న మత్స్యకారులకు బీసీ కార్పొరేషన్‌లో కలిపారు తప్ప ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదన్నారు. ప్రభుత్వం మత్స్యకారులను వాడుకుంటోంది తప్ప సరైన రాజకీయ ప్రాధాన్యత ఇవ్వడంలేదని వాపోయారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మత్స్యకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాఫ్ జిల్లా అధ్యక్షుడు మైలపల్లి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలకు ముఠా కార్మికుల విరాళం

అచ్యుతాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సెజ్ కర్మాగారాల్లో పనిచేస్తున్న గురజాపాలెంకి చెందిన ముఠా కార్మికులు సీఐటీయూ అఖిల భారత మహాసభలకు రూ.పది వేలు విరాళాన్ని మంగళవారం రాష్ట్ర కార్యదర్శి జి. కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి రొంగలి రాములకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు ఉదారంగా విరాళం ఇవ్వడం ఆనందదాయకమన్నారు. తాము ఎల్లప్పుడు కార్మికుల తరఫున పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముఠా నాయకులు రాము, పైడిరాజు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయండి

మునగపాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశాఖలో జరగనున్న సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వీవీ.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద మంగళవారం ఆశ వర్కర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు మహాసభలు జరుగుతాయని తెలిపారు. ా ర్యక్రమంలో ఎస్.బ్రహ్మాజీ, ఆశ యూనియన్ జిల్లా కోశాధికారి పార్వతి, కుమారి, లక్ష్మి, పద్మ, ఉమ, వరలక్ష్మి పాల్గొన్నారు.

యువజన మందిరానికి రూ.లక్ష విరాళం

మునగపాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో నాటిక పరిషత్‌లు నిర్వహిస్తున్న గ్రామీణ యువజన మందిరం శాశ్వత నిధికి గవర కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం కమిటీ సభ్యులు ఆడారి శ్రీకాంత్, మళ్ల రామజోగి, ఆడారి గంగమహేష్, ఆడారి సూర్యచంద్రరామారావులకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ, సర్పంచ్ దిమ్మల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రెండు వర్గాల తగాదాలో ఒకరికి గాయాలు

ఎలమంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తలి గ్రామంలో సోమవారం రాత్రి రెండు వర్గాలు ఫ్లెక్సీలు ఏర్పాటుపై ఘర్షణ పడ్డాయి. జనసేన, టీడీపీలకు చెందిన కొందరి మధ్య తగాదా, తోపులాట చోటుచేసుకున్నట్టు తెలిసింది. ఈ తోపులాటలో ఒకరికి గాయాలు కావడంతో విశాఖ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నట్టు సమాచారం. సోమవారం ఉదయం ఇన్‌చార్జ్ ఎంపీపీగా రాజాన శేషు బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై రూరల్ ఎస్ఐ ఉపేంద్రను ఫోన్‌లో వివరణ కోరగా కొత్తలి గ్రామంలో చిన్న తగాదా జరిగిందని పరస్పరం ఫిర్యాదు చేసారని బదులిచ్చారు.

'నక్కపల్లి డివిజన్‌లో మునగపాక విలీనం సరికాదు'

మునగపాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు కొత్త నిర్ణయాలు తీసుకునే ముందు ప్రజాభిప్రాయాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉందని వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అనకాపల్లి డివిజన్‌లో ఉన్న మునగపాక మండలాన్ని 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న నక్కపల్లిలో విలీనం చేయాలనుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. ఈ అంశంపై స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలతో పాటు కూటమి నాయకులు స్పందించాల్సి ఉందన్నారు. విలీనంపై పునరాలోచనలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు పెటకోట స్వామిసత్యనారాయణ, వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఆడారి కాశిబాబు పాల్గొన్నారు.

వైసీపీ నేత కుటుంబాన్ని పరామర్శించిన ధర్మశ్రీ

అచ్యుతాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పూడిమడకలో ఆకస్మికంగా మరణించిన వైసీపీ నాయకుని కుటుంబాన్ని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ మంగళవారం పరామర్శించారు. రేవిడి ఆనందరావు (53)కి గుండెపోటు రావడంతో విశాఖలో గల ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆనందరావు మరణించాడు. విషయం తెలిసిన వెంటనే ధర్మశ్రీ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోన బుజ్జి, వాసుపల్లి శ్రీనివాసరావు, ఉమ్మిడి జగన్, చోడిపల్లి అప్పారావు, చేపల శ్రీరాములు, మేరుగు రాజేష్ పాల్గొన్నారు.

కట్టుబోలు నవదుర్గ శూలాల జాతర రేపు

రాంబిల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టుబోలులో ఈనెల 4వ తేదీన నవదుర్గ శూలాల జాతర జరగనుందని, ఈ సందర్భంగా అంబలం పూజ నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ పెద్దలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 6 గంటలు నుంచి పడిపూజ జరగనుందని, మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మధ్యాహ్నం 3 గంటలు నుంచి శూలాల పండుగ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి భవాని భక్తులు, అయ్యప్పస్వాములు, శివస్వాములు, గోవిందా స్వాములు హాజరుకావాలని కమిటి పెద్దలు కోరారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

మునగపాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో గణపర్తి గ్రామంలో ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తహశీల్దార్ పి.సత్యనారాయణ తెలిపారు. గణపర్తి గ్రామం చల్లమల్ల రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 35లో ప్రభుత్వ భూమి ఉన్నందున ఎటువంటి ఆక్రమణలు చేయకూడదని తెలిపారు. హద్దులను కూడా గుర్తించడం జరిగిందన్నారు. ఎటు వంటి వివాదాలకు తావులేకుండా ఎస్ఐ పి.ప్రసాదరావు తన సిబ్బందితో భద్రత ఏర్పాటు చేశారు.

మత్స్యకారులకు ప్రభుత్వం అండ

» రాయితీపై బోటు ఇంజన్లు పంపిణీ

» టీడీపీ 'పేట కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్



మత్స్యకారులకు బోటు ఇంజన్లు పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

నక్కపల్లి/ పాయకరావుపేట రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపలవేట సాగించే మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా వుంటుందని టీడీపీ పాయకరావుపేట నియోజకవర్గం కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ అన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద 40 శాతం రాయితీపై మంజూరైన బోటు ఇంజన్లను మంగళవారం హోం మంత్రి అనిత క్యాంపు కార్యాలయం వద్ద మత్స్యకారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వేసవిలో చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే భృతిని ప్రభుత్వం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచిందని, రాయితీపై డీజిల్ అందజేస్తున్నదని తెలిపారు. ఒక్కో ఇంజను ధర రూ.83 వేలు కాగా ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తున్నదని, మత్స్యకారులు రూ.50 వేలు చెల్లిస్తే చాలని అన్నారు. తొలివిడత 15 మంది మత్స్యకారులకు ఇంజన్లు అందించగా.. వీరిలో 14 మంది పాయకరావుపేట మండలం వెంకటనగరం, రాజానగరం గ్రామాలకు చెందిన మత్స్యకారులు వున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దేవర సత్యనారాయణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల టీడీపీ అధ్యక్షులు చించలపు ప్రదీప్, గింజాల లక్ష్మణరావు, అమలకంటి అబద్ధం, 'పేట జడ్పీటీసీ మాజీ సభ్యుడు వంకా సత్యనారాయణ, వెంకటనగరం సర్పంచ్ వంకా వెంకటరమణ, నాయకులు యాళ్ల వరహాలు, విలియం కేరీ, గోసల శ్రీకాంత్, మత్స్యశాఖ అధికారులు విజయ, పాల్గొన్నారు.

సకాలంలో ఇంటి పన్నులు వసూలు చేయాలి



దార్లపూడిలో ఇంటి పన్ను రశీదు అందజేస్తున్న డిప్యూటీ డీఈవో సత్యనారాయణ

ఎస్.రాయవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని పంచాయతీల్లో ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేసి పంచాయతీల ఆర్థిక వనరుల పెంపునకు కృషి చేయాలని డిప్యూటీ డీఈవో బంగారు సత్యనారాయణ సూచించారు. మంగళవారం దార్లపూడి, భీమవరం గ్రామ పంచాయతీల్లో చేపట్టిన ఇంటి పన్నుల వసూలు ప్రక్రియ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ నిబంధనల మేరకు స్వర్ణ పంచాయతీల్లో ఇంటి పన్నులను ఆన్‌లైన్‌లో మాత్రమే వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శిలను ఆదేశించారు.

కరాటే టోర్నీలో ఎలమంచిలి విద్యార్థులకు పతకాలు



కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

ఎలమంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీలో ఎలమంచిలికి చెందిన 31 మంది క్రీడాకారులు అత్యధిక పతకాలు సాధించారని కరాటే నిర్వాహక కోచ్ నక్కా వెంకట్రామన్ తెలిపారు. ఈ టోర్నమెంటులో ఎలమంచిలి కెఎన్‌ఆర్ మార్షల్ ఆర్ట్స్ ఇన్‌స్ట్రక్టర్ వెంకట్రామన్, కె.శ్రీనుల పర్యవేక్షణలో విద్యార్థులు పాల్గొని ఆద్యంతం తమ ప్రతిభను ప్రదర్శించారన్నారు. క్రీడాకారులు 3 బంగారు, 8 సిల్వర్, 20 బ్రాంజ్ పతకాలు సొంతం చేసుకున్నారని చెప్పారు. ఈ టోర్నీలో పి. కుషాలిని, కే.హేతిశ్రీ చంద్రిక, ఎస్‌కే.ఆఫ్రిన్ బంగారు పతకాలు కైవసం చేసుకున్నారన్నారు. క్రీడాకారుల ఉన్నతికి కృషి చేసిన శిక్షకులు వెంకట్రామన్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ టోర్నీలో విజేతలుగా నిలిచిన ఎలమంచిలి క్రీడాకారులను పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారన్నారు.

రెండో రోజుకు చేరిన యువకుల ఆమరణ నిరాహారదీక్ష

ఎలమంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పెదపల్లి సమీపంలోని చెరువు స్థలం ఆక్రమణకు గురి కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ యువకులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష మంగళవారం నాటికి రెండో రోజుకు చేరింది. ప్రభుత్వానికి చెందిన చెరువు స్థలం ఆక్రమణకు గురికాకుండా పూర్వపు రికార్డులు పరిశీలన చేసి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరుతూ పెదపల్లి, మంత్రిపాలెం, గొల్లపాలెం ప్రాంతాలకు చెందిన యువకులు ఆమరణ దీక్ష చేపట్టారు. యువకులు చేపట్టిన ఈ దీక్షలకు ప్రజలు తమ వంతు సంఘీభావం తెలిపారన్నారు.



ఆమరణ నిరహార దీక్షా శిబిరాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ నేత బొడ్డపు శ్రీనివాసరావు

అండర్ పాస్ రోడ్డులో నిలిచిన వర్షం నీరు

ఎలమంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఎస్‌ఆర్‌పేట గ్రామ సమీపంలోని ఏటికొప్పాక రైల్వే గేటు మధ్యలో నిర్మించిన అండర్‌పాస్ రోడ్డుపై నిత్యం వర్షం నిలిచి ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పొలాలకు వెళ్లేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉండే ఈ రోడ్డుపై నిత్యం నీరు నిలిచిపోడడంతో రాకపోకలు సాగించేందుకు అవస్థలు ఎదుర్కొవాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. అండర్ పాస్ రోడ్డుపై నీరు నిలిచిపోకుండా తగిన చర్యలు తీసుకుని ఉపయోగపడేలా చేయాలని పలువురు కోరుతున్నారు.



వార్షికోత్సవ వేడుకలను జరుపుతున్న గంగాధర్

ఘనంగా ఎస్‌ఎస్‌ఎఫ్ 10వ వార్షికోత్సవం

ఎలమంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ గ్రామాన సమరసతా సేవా ఫౌండేషన్ ద్వారా ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను ప్రారంభించి నేటికి పదేళ్లు పూర్తి చేసుకోవడం జరిగిందని ఆ ఫౌండేషన్ ఉత్తరాంధ్ర ధర్మ ప్రచారక్ ఆడారి గంగాధర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అయోధ్యపురి కాలనీలో టీటీడీ నిధులతో నిర్మించిన దేవాలయం వద్ద ఎస్ఎస్ఎఫ్ 10 వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఎఫ్ ఫౌండేషన్‌ను 2015 డిసెంబరు 2వ తేదీన ప్రారంభించామని జరిగిందన్నారు. ప్రతి దేవాలయంలో 11 దివ్య జ్యోతులు(దీపాలు)వెలిగించి సంస్థ ద్వారా చేపడుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలను వివరించారన్నారు. పదేళ్లుగా దేవాలయాల్లో క్రమం తప్పకుండా ప్రతి వారం భజన కీర్తనలు ఆలపించడం, ప్రతి పౌర్ణమికి సామూహిక హారతి వెలిగించి ఆధ్యాత్మికతను పెంపొందించడం, ఏకాదశి నగర సంకీర్తన, రెండవ శనివారం సత్సంగ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ సనాతన ధర్మం పట్ల ప్రతి ఒక్కరిలోనూ అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కనకరాజు, దేవాలయ కమిటీ ప్రతినిధులు బి. శ్రీను, సత్తిబాబు, నానాజీ, లక్ష్మీ, నాగలక్ష్మి, బాల వికాస్ మాతాజీ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎలమంచిలి అయోధ్యపురి కాలనీ ఆలయం వద్ద ఎస్ఎస్ఎఫ్ 10వ వార్షికోత్సవాన్ని జరుపుతున్న గంగాధర్

నేడు ఉచిత ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వర్క్‌షాపు

ఎలమంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం 10 గంటలకు ఉచిత ఉద్యమ్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని జిల్లా పరిశ్రమల శాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారని ఎంపీడీఓ కేఎస్. కొండలరావు తెలిపారు. రిజిస్ట్రేషన్‌లు లేని వ్యాపార, పరిశ్రమలు, సేవా రంగ సంస్థల యజమానులు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా అధికారిక గుర్తింపు, బ్యాంకు రుణాలు, కేంద్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, మార్కెటింగ్, టెండర్లలో పాల్గొనే అవకాశాలు లభిస్తాయన్నారు. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ దరఖాస్తుదారుల పాన్‌కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా సంఖ్య ఓటీపీ కోసం ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నెంబరు వివరాలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

కొత్తపేట హైస్కూల్ విద్యార్థులకు గుర్తింపు కార్డులు

ఎలమంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం గుర్తింపు కార్డులు పంపిణీ చేసినట్టు హెచ్ఎం తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఈ గుర్తింపు కార్డులను పంపిణీ చేశామని తెలిపారు.

ఇళ్ల స్థలాల కేటాయింపులో అవకతవకలు సరిదిద్దాలి

రాంబిల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దిమిలిలోని ఎస్సీలకు మంజూరు చేసిన ఇళ్ల స్థలాలు కేటాయింపులో అవకతవకలను సరిదిద్దాలని పలు ఎస్సీ కుటుంబాలు వారు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల ఐక్య వేదిక అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు పాము నాగభూషణం,సహాయ కార్యదర్శి పాము గణేష్‌ల ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దిమిలిలో ఎస్సీలకు మంజూరు చేసిన ఇంటి స్థలాలను నేతలు అర్హులైన లబ్ధిదారులకు ఇవ్వకుండా తమకు అనుకూలమైన వారికి కేటాయించారని ఆరోపించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలు అర్హత కలిగిన వారికి అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కార్యక్రమంలో స్థానికులు టేకు జోగారావు, రేబాక విజయ్, భాస్కరరావు, మాదల శివగణేష్, కొమ్ము చిన్నారావు, మల్లమట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

7న సిరి గంధం నాటిక ప్రదర్శన

మునగపాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందీశ్వర ప్రాంగణం, తులసీ కళావేదికపై ఈనెల 7వ తేదీన 'సిరి గంధం' నాటిక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. రంగస్థల దర్శకుడు, స్వర్గీయ మొతికా సాంబశివరావు మాస్టార్ జ్ఞాపకార్థం ఆయన అభిమానులు నాటిక ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నారు.

మంగవరంలో రోడ్డు పక్కనే చెత్త



మంగవరం గ్రామం శివారులో రోడ్డు పక్కన చెత్తను వేసి తగలబెడుతున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగవరం శివారు గోపాలపట్నం వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డును డంపింగ్ యార్డుగా ఉపయోగిస్తున్నారు. గ్రామంలోని చెత్తా, చెదారాన్ని రోడ్డు పక్కన వేసి వాటిని తగులబెడుతున్నారు.

దీంతో వాయు కాలుష్యం ఏర్పడడమే కాకుండా రోడ్డులో ప్రయాణం సాగించేవారు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో చెత్తా, చెదారాన్ని ఇంటింటా సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించి, వర్మీ కంపోస్టును తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయినా పంచాయతీలలో మాత్రం చెత్తను సంపద కేంద్రాలకు తరలించడం లేదు. కనీసం మండల అధికారులు కూడా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను రోడ్డు పక్కన వేయకుండా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేడు గుడివాడలో హోం మంత్రి అనిత పర్యటన

ఎస్.రాయవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మండలంలోని గుడివాడ గ్రామంలో బుధవారం పర్యటించనున్నారని మండల వ్యవసాయాధికారిణి సౌజన్య తెలిపారు. ఈ గ్రామంలో నిర్వహిస్తున్న రైతన్నా.. మీకోసం ముగింపు కార్యక్రమంలో మంత్రి అనిత పాల్గొంటారన్నారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు.

హాస్టల్‌లో డీఎస్‌డబ్ల్యూఓ రాత్రి బస

అచ్యుతాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమీకృత వసతి గృహంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బి.రామానందం సోమవారం రాత్రి బసచేశారు. ఈ సందర్భంగా వసతిగృహంలో విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పదో తరగతి విద్యార్థుల ప్రతిభా పాఠవాలను పరీక్షించారు. పబ్లిక్ పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణులు కావాలని ఆకాక్షించారు. మంగళవారం ఉదయం విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. వసతి గృహంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

11 మద్యం బాటిళ్లతో ఇద్దరి అరెస్టు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పోలీసులు మంగళవారం విస్తృత దాడులు నిర్వహించి, వేర్వేరు చోట్ల ఎటువంటి అనుమతుల్లేకుండా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి పాయకరావుపేట సీఐ జి.అప్పన్న అందజేసిన వివరాలిలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం ఎస్ఐ పురుషోత్తంకి వచ్చిన పక్కా సమాచారంతో మండలంలోని అరట్లకోట గ్రామంలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతడి నుంచి ఐదు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా ఏఎస్ఐ గోవిందరావు మండలంలో మంగవరం గ్రామ శివారులో పాన్‌షాపులో ఎటువంటి అనుమతుల్లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టండి : ధర్మశ్రీ

రాంబిల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామాల్లో ఇంటింటికి తెలియజేయాలని వైసీపీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని వెల్చూరు, లోవపాలెం గ్రామాల్లో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆయా గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ధర్మశ్రీ మాట్లాడుతూ అధికారం కోసం సీఎం చంద్రబాబునాయుడు అమలుకు నోచుకోని హామీలను గుప్పించి అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు పి.కిషోర్, మాజీ అధ్యక్షుడు జి.శ్రీనుబాబు, జడ్పీటీసీ సభ్యులు ధూళి నాగరాజు, వైసీపీ నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షుడు కొవిరి రామకృష్ణ పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ను అభివృద్ధి బాటలో నడిపిస్తా..

» రాంబిల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి చిట్టిబాబు

రాంబిల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి పీఏసీఎస్‌ను అభివృద్ధి బాటలో నడిపిస్తానని ఆ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి ఎరిపల్లి చిట్టిబాబు అన్నారు. మంగళవారం ఆయన పీఏసీఎస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం తనపై ఉన్న నమ్మకంతో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా నియమించిందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పీఏసీఎస్ ద్వారా రైతులకు సేవలు అందదించి ప్రభుత్వానికి మంచి పేరుతీసుకువస్తానన్నారు. రైతులకు అందుబాటులో ఉంటూ ఈ బ్యాంక్ ద్వారా ప్రభుత్వం అందించే సదుపాయాల పార్టీలకతీతంగా రైతులకు చేరువచేస్తానన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత మండల ధ్యక్షుడు ఎరిపల్లి అజయ్ తదితరులు ఉన్నారు.

5న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

కోటవురట్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోనిపాఠశాల్లో ఈనెల 5వ తేదీన పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని నిర్వహించడాకి చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, ఎంఈవో రామారావు, మేజర్‌పంచాయతీ కార్యదర్శి రఘురామ్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల ప్రగతిని తెలుసుకోవడానికి గ్రామ సచివాలయ సిబ్బంది థర్డ్ పార్టీ ఎవాల్యూషన్ చేస్తుందన్నారు. ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టుల్లో ప్రగతి ఏవిధంగా ఉందో తెలుసుకోవాలని లక్ష్యంతో ఎవాల్యూషన్ చేస్తుందన్నారు. విద్యార్థి గ్రేడింగ్ వారి తల్లిదండ్రులకు తెలియజేసేందుకు ఈనెల 5వ తేదీన ఆయా పాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్ నిర్వహిస్తున్నామన్నారు.

కోటవురట్ల-1 ఆరోగ్య కేంద్రం తనిఖీ



డాక్టర్స్, సిబ్బందితో సమీక్షిస్తున్న డీపీఎంవో ప్రశాంతి

కోటవురట్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కోటవురట్లలో ఆయుష్ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ లీడర్, జిల్లా ప్రోగ్రాం మేనేజిమెంట్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్‌సెంటరులో రికార్డులను తనిఖీలు నిర్వహించారు. గర్భిణుల వివరాలు, కుష్టు వ్యాధి సర్వేపై ఆరా తీశారు. పాఠశాల్లో విద్యార్థులకు క్రమంగా ఆరోగ్య తనిఖీలు చేయాలన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో రివ్యూ నిర్వహించారు. ఆవె వంటె ఎస్‌వో రామచంద్ర, డీపీవో జగదీశ్, జనార్దన్, డాక్టర్ ప్రత్యూషా,హెచ్‌వీ జయమ్మ, ఎంపీహెచ్‌వో బెన్నయ్య పాల్గొన్నారు.

లోవాంబిక అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

రాంబిల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకివాడ గ్రామంలో కొలువైన లోవాంబిక అమ్మవారికి మంగళవారం భక్తులు ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు దర్శించి, పసుపు, కుంకుమలను నివేదించారు. తమ మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహక పెద్దలు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక అమ్మవారి పండగ

అచ్యుతాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరేంద్రపురంలో నూకాంబిక అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు సమర్పించి పూజలు జరిపారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, వైసీపీ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యే సోదరుడు సతీష్‌కుమార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా అప్పలనాయుడు

రాంబిల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా మండలంలోని గోరపూడి పంచాయతీ అప్పన్నపాలెం గ్రామానికి చెందిన లెక్కల అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానన్నారు. ఈ మేరకు మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు లాలం భరత్, టీడీపీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయానికి తాళాలు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మునగపాక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో గణపర్తి రామాలయంలో అక్టోబరు 15వ తేదీన ఉత్సవ కమిటీ సభ్యులుండగా గేటుకు తాళాలు వేసిన వారిపై ఇంతవరకు చర్యలు తీసుకోలేదని అదే గ్రామానికి చెందిన చదరం అప్పలనాయుడు ఆరోపించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ అక్టోబరు 16వ తేదీన నిర్వహించతలపెట్టిన గౌరీపరమేశ్వరుల ప్రతిష్ఠ ముందు రోజు రాత్రి ఏర్పాట్లో నిమగ్నమయ్యామన్నారు. అదే సమయంలో కొంతమంది వ్యక్తులు గౌరీ పరమేశ్వరులు ఆలయానికి తాళాలు వేసి, కార్యక్రమం జరగకుండా అడ్డుకున్నారన్నారు.


అనకాపల్లిలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

ప్రణాళికతోనే సమగ్రాభివృద్ధి: ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచించారు. పట్టణంలోని గుండాల జంక్షన్‌లో జీవీఎంసీ ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి, కశింకోట మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. జీవీఎంసీ పరిధిలో పారిశుధ్య పనులు, ఇతరత్రా అభివృద్ధి కార్యక్రమాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి, డీఆర్‌డీఏ పీడీ సచీదేవి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులను వారి శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే అడిగి తెలుసుకొని పలు సూచనలు చేశారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా


సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలు అందిస్తున్న దృశ్యం

కొత్తూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన పేదలకు భరోసా కల్పించేందుకే ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, జనసేన పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ అన్నారు. రింగురోడ్డులోని జనసేన పార్టీ కార్యాలయంలో 12 మంది లబ్ధిదారులకు రూ.3.78 లక్షల సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేదలందరికీ కొండంత అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా దివ్యాంగుల క్రీడా పోటీలు


ట్రై సైకిల్ రన్ పోటీలు ప్రారంభిస్తున్న జడ్పీ చక్రవర్తి

అనకాపల్లిటౌన్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడా మైదానంలో మంగళవారం దివ్యాంగులకు ఏర్పాటు చేసిన క్రీడా పోటీలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగాయి. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడలాభివృద్ధి అధికారిణి పి.శైలజ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలను జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి ప్రారంభించారు. షార్ట్‌పుట్, ట్రై సైకిల్ రన్, క్యారమ్స్ పోటీలను నిర్వహించగా, దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుడో అసోసియేషన్ కార్యదర్శి శశి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పి.వీరుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్, ఎస్సీ మోర్చా అధ్యక్షులకు సత్కారం


శరగడం శంకరరావు, స్వామాట్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

సబ్బవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులుగా నియమితులైన శరగడం శంకరరావు, జి.స్వామాట్‌కుమార్‌ను బీజేపీ నాయకులు మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా శంకరరావు, స్వామాట్‌కుమార్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో పదవులు కట్టబెట్టిన రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జిల్లా కోర్ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి రామునాయుడు, నాయకులు మండల స్వామిచక్రవర్తి, దాడి రామునాయుడు, గొంప పెంటారావు, ఆకాశ్‌కుమార్, ప్రభుకుమార్, ఈశ్వరరావు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

హరి నారాయణాచార్యులతో ప్రవచనాలు


ప్రవచనాలు చెబుతున్న నారాయణాచార్యులు

కొత్తూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశ్వశాంతి కోసం గాంధీనగరం వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న చండీయాగ మహోత్సవాలు మంగళవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. అన్నమాచార్యుల 12వ తరం వారసులు తాళ్లపాక హరినారాయణాచార్యులతో ప్రవచన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సాయంత్రం హనుమత్ వ్రతం, సింధూర పూజ, కుంకుమపూజ నిర్వహించారు. ఉదయం మాజీ మంత్రి దాడి వీరభద్రరావు చండీమాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రేజేటి చక్రవర్తి, కన్నబాబు, మారుతి ఆయనను సత్కరించి మహాచండి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతపై దృష్టిసారించండి

పరవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల భద్రతపై మరింత దృష్టిసారించాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు సూచించారు. పరవాడ పోలీస్ స్టేషన్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లతో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా విద్యార్థినుల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గంజాయి, మత్తు పదార్థాల వినియోగానికి విద్యార్థులను దూరంగా ఉంచాలని సూచించారు. పోలీస్, విద్యా సంస్థల మధ్య సమాచార సౌలభ్యం కోసం వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఘనంగా దుర్గాదేవి అంబలం పూజ

సబ్బవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లుప్పి శివారు మర్రిపాలెం గ్రామంలో దుర్గాదేవి అంబలం పూజ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి పీఠాన్ని విద్యుత్ కాంతులతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సబ్బవరంతో పాటు పరిసర మండలాల నుంచి భవానీ మాలధారులు తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. ముందుగా గణేశుడు, లక్ష్మీ, సరస్వతి పూజలు చేశారు. అనంతరం భక్తులు అన్న ప్రసాదాల పంపిణీ జరిగింది.

అధికారులతో ప్రతి నెలా మండల స్థాయి సమీక్ష

» ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో ప్రతి నెలా మండల స్థాయి సమీక్ష నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. నూకాంబిక ఫంక్షన్ హాలులో మంగళవారం ఏర్పాటు చేసిన సభలో పలు సమస్యలను నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కశింకోటలో అధికారుల పనితీరు సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. జిరాయితీలో నిర్మించుకున్న ఇంటికి కరెంటు మీటరు కనెక్షన్ ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకుంటే పంచాయతీ అధికారుల నుంచి ఎన్‌వోసీ కావాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులకు అడుగుతున్నారని, కనెక్షన్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన చెప్పారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో స్థలం చూపకుండా ఇళ్ల పట్టాలు ఇచ్చారని, ఇప్పుడు ఇంటికి దరఖాస్తు చేసుకుంటే స్థలం ఇచ్చినట్టు ఆన్‌లైన్‌లో చూపించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. గృహ నిర్మాణ శాఖలో జరిగిన అవినీతిపై పూర్తి సర్వే జరిపి న్యాయం చేయాలన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ పంచాయతీ అధికారులు ప్రభుత్వ భూములకు అయితేనే ఎన్‌వోసీలు సులువుగా జారీ చేస్తారని, జిరాయితీ అయి సొంత గూటికి ఎన్‌వోసీ ఇచ్చేందుకు ఇబ్బందులకు గురి చేయడం తగతని చెప్పారు. కశింకోటలో పంచాయతీ స్థలంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు ఏ విధంగా ఎన్‌వోసీ ఇచ్చారో చెప్పాలన్నారు. మండల స్థాయిలో ఉన్నతాధికారులతో సమీక్ష ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ కార్పొరేట్ బ్యాంకులకు దీటుగా వ్యవసాయ సహకార బ్యాంకులను అభివృద్ధి చేస్తామన్నారు. 2028 నాటికి రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సొంతింటి కళ నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కశింకోట పీఏసీఎస్‌లో సీఎస్‌సీ కేంద్రం కూడా ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. అనంతరం రైతులకు చెక్కులు పంపిణీ చేశారు. ముందుగా మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ సీఎం రమేశ్ మాతృమూర్తి మృతికి సంతాపం తెలియజేసి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఉమ్మడి విశాఖ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, కూటమి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, వేగి గోపీ, నైనంశెట్టి రమణారావు, దొడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ప్రమాణ స్వీకారం


కశింకోట పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపడుతున్న శ్రీనివాసరావు

కశింకోట, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): కశింకోట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ప్రమాణ స్వీకారం మంగళవారం అట్టహాసంగా జరిగింది. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సిదిరెడ్డి శ్రీనివాసరావు, డైరెక్టర్లు గండిబోయిన కాశీరావు, శిష్టి అప్పారావులతో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పాలక వర్గాన్ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూకాంబిక ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు రూ.20 కోట్లు టర్నోవర్ ఉన్న సహకార బ్యాంకులో 5,789 మంది షేర్ హోల్డర్లు ఉన్నారన్నారు. 2020-2025లో రూ.16.58 లక్షలు లాభంలో ఉందని, దాన్ని నూతన పాలకవర్గం రూ.50 కోట్లకు పెంచాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆలోచనతో అనకాపల్లి జిల్లా నంబర్ వన్ జిల్లాగా మారే అవకాశం ఉందన్నారు. జిల్లాలో అన్ని సమస్యలకూ త్వరలోనే పూర్తి పరిష్కారం దొరుకుతుందన్నారు. అన్ని రంగాల్లోనూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే దిశగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తున్నదని ఆయన చెప్పారు.

ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి

» జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి హైమావతి


ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హైమావతి

కశింకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెరగాలని అనకాపల్లి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎం.హైమావతి ఆదేశించారు. మేజర్ పంచాయతీ తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రికార్డులు, మందులను ఆమె పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ జరుగుతున్న ప్రసవాల సంఖ్య మెరుగుపడాలని సూచించారు. అలాగే లక్ష్యాలను శతశాతం సాధించాలని చెప్పారు. ఆశ డే పురస్కరించుకొని ఆశ కార్యకర్తలతో మాట్లాడారు. ఈ నెల 21న జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.సుమ, ఎంపీహెచ్‌ఈవో వి.ఏ.సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్‌లో ఖాళీ పోస్టులను పారదర్శకంగా భర్తీచేయాలి

అనకాపల్లిటౌన్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ఈపీడీసీఎల్ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టులను నిబంధనల ప్రకారం ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా భర్తీ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీవీ.శ్రీనివాసరావు, ఆర్.శంకరరావు కోరారు. సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ ఈపీడీసీఎల్ పరిధిలో ఇప్పటికే ఖాళీలతో పాటు కొత్తగా నిర్మాణం చేపట్టిన సబ్ స్టేషన్‌లలో ఖాళీలను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నిబంధనలకు అనుగుణంగా వెంటనే భర్తీ చేయాలని కోరారు. నిబంధనల ప్రకారం నోటిఫికేషన్ విడుదల, దరఖాస్తుల స్వీకరణ, రిజర్వేషన్, రోస్టర్ విధానం అమలు, మెరిట్ లిస్టు ఆధారంగా అభ్యర్థుల ఎంపిక పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

» 17.6 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

కొత్తూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని కొప్పాక గ్రామంలో ఈ ఏడాది మార్చిలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేశామని అనకాపల్లి రూరల్ సీఐ జి.అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సబ్బవరంలోని సాయినగర్‌లో నివాసం ఉంటున్న గేదెల రాజశేఖర్ అనకాపల్లి మండలం కొప్పాక గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటిలోకి చొరబడి చోరీ చేశాడన్నారు. ఈ విధంగా దఫదఫాలుగా చోరీ చేసిన సొత్తును అమ్ముతున్న సమయంలో పట్టుకున్నామని తెలిపారు. ఎస్‌ఐ రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం సిరసపల్లి బస్టాప్ దగ్గరలో విశ్వసనీయ సమాచారం మేరకు రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. ఆయన నుంచి ఒక నక్లెస్, ఒక బంగారు ఉంగరం, ఒక జత చెవి దిద్దులు కలిపి మొత్తం 17.6 గ్రాములు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు రాజశేఖర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. కేసును ఛేదించిన ఎస్‌ఐలు నాగేశ్వరరావు, రవికుమార్, సిబ్బంది గోవింద, వెంకటేష్, లక్ష్మణ్, సతీశ్‌లను అభినందించారు.

భూసార పరీక్షలు తప్పకుండా చేయించాలి

» జిల్లా వ్యవసాయాధికారి ఆశాదేవి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఆశాదేవి

కొత్తూరు, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ద్వారా నేలలో పోషక విలువలు ఎంతమేర వున్నాయో తెలుస్తుందని జిల్లా వ్యవసాయాధికారి ఆశాదేవి అన్నారు. మంగళవారం అనకాపల్లి మండలం తగరంపూడిలో భూసార పరీక్షపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మనిషికి రక్తపరీక్ష ఎంత అవసరమో పంట భూములకు భూసార పరీక్ష అంతే అవసరమన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఏ ఎరువు, ఎంత మోతాదులో వేయాలో తెలుస్తుందని చెప్పారు. రబీ పంటల సాగు పూర్తయిన వెంటనే రైతులంతా తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అంతకన్నా ముందు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రంగాచారి, ఆత్మ ఏటీఎం రామకృష్ణ, డీఆర్‌సీ తులసీ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో భూమి ఆరోగ్య స్థితి గుర్తింపు

కశింకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భూమి ఆరోగ్య స్థితిని తెలుసుకోవాలంటే భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకుడు (ఏడీ) శ్రీధర్ స్పష్టం చేశారు. మండలంలోని సోమవరం గ్రామంలో భూసార పరీక్షలపై మంగళవారం రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసార పరీక్షల వల్ల భూమి ఆరోగ్య స్థితిని తెలుసుకోవచ్చన్నారు. అలాగే పోషకాల విలువలు, సమతుల్యత తెలుస్తాయని చెప్పారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యూరియా వాడకం తగ్గించడం వల్ల భూసారం పెరుగుతుందని చెప్పారు. రైతులు తగిన మోతాదులో ఎరువులు వాడాలని ఆయన సూచించారు. అలాగే భూసార పరీక్షలు చేయించుకుని, దానికి అనుగుణంగా ఎరువులు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జరిగిన వ్యవసాయాధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇది మైదానం కాదు.. చెరువే!


మైదానాన్ని తలపిస్తున్న పరవాడ పైడమ్మబంద చెరువు

పరవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరవాడలోని పైడమ్మబంద చెరువు మైదానాన్ని తలపిస్తోంది. చెరువు నిండా నీరు ఉన్నప్పటికీ, ఎక్కడా నీటి ఆనవాళ్లు కనిపించడం లేదు. చెరువు అంతా గుర్రపు డెక్క ఆవరించింది. దీంతో అది మైదానమా? లేక చెరువా? అనే సందేహం చూపరుల్లో కలుగుతోంది. ఈ క్రమంలో అటుగా రాకపోకలు సాగించే వారంతా ఈ చెరువును చూసి మైదానంలా ఉందని ఆశ్చర్యపోతున్నారు. కాగా, గుర్రపు డెక్క ఆవరించడంతో దిగువ ఉన్న పొలాలకు నీరు మళ్లించడం కష్టతరమవుతున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇరిగేషన్ శాఖ అధికారులు తక్షణవే స్పందించి చెరువులో గుర్రపు డెక్కను తొలగించేలా తగిన చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

'మన పల్లెకు-మన ఎమ్మెల్యే' రేపు

సబ్బవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టెక్కలిపాలెం, అంతకాపల్లి గ్రామాల్లో గురువారం మన పల్లెకు-మన ఎమ్మెల్యే కార్యక్రమం జరుగుతుందని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కర్రి కనకరాజు తెలిపారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు హాజరయ్యే ఈ కార్యక్రమం ఉదయం 9.30 గంటలకు టెక్కలిపాలెం, 10.30 గంటలకు అంతకాపల్లి గ్రామంలో జరుగుతుందన్నారు. గ్రామాల్లో సమస్యలు ఎమ్మెల్యే నేరుగా తెలుసుకొని, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని చెప్పారు. లాఏ వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి చేస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, కూటమి నాయకులు పాల్గొనాలని కోరారు.

రెడ్‌క్రాస్ కార్యవర్గ ప్రతినిధులు చిత్తశుద్ధితో పనిచేయాలి: కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నూతనంగా ఎన్నికైన రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా రెడ్ క్రాస్ అధ్యక్షులు, కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. గత నెల 8న కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా రెడ్‌క్రాస్ నూతన అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికలు జరిగాయి. ఎన్నికైన నూతన కార్యవర్గం ప్రతినిధులు కలెక్టర్ విజయకృష్ణన్‌ను మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలను అందించాలని చెప్పారు. రెడ్‌క్రాస్ చేపట్టే కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తానని కలెక్టర్ భరోసా ఇచ్చారు.

వసతిగృహ విద్యార్థినులకు రగ్గులు

పరవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతిగృహం విద్యార్థినులకు మంగళవారం రగ్గులు పంపిణీ చేశారు. విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ సమన్వయాధికారి పి.ఎర్రయ్య వీటిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు చక్కగా చదువుకుని ప్రయోజకులుగా ఎదగాలన్నారు. మొత్తం 125 మంది విద్యార్థినులకు రగ్గులను అందజేశారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ శ్రీకాంత్, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, మేట్రిన్ సుజాత, పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇండస్ట్రియల్ పార్కులోని పరవాడ, పోలిరెడ్డిపాలెం, వెంకటాపురం, పెదముషిడివాడ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు బుధవారం నుంచి మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ నిర్వహణ పనుల్లో భాగంగా ఆయా రోజుల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు. వీలైనంత మేర ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా సరఫరా అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులంతా గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

బేస్‌లైన్ పరీక్ష పూర్తిచేయండి

సబ్బవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఫౌండేషన్ కోర్సులో భాగంగా బేస్‌లైన్ పరీక్షను ఈ నెల 5వ తేదీలోగా పూర్తిచేయాలని మండల విద్యా శాఖాధికారులు లక్ష్మణరావు, రవీంద్రబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం బేస్‌లైన్ టెస్ట్ నిర్వహణకు సంబంధించి సీఆర్‌పీలతో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణితం, ఇంగ్లీషు, తెలుగు పాఠ్యాంశాల్లో విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇంతవరకు 60 శాతం మంది విద్యార్థులకు ఈ పరీక్ష పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ నెల 5న ప్రతి పాఠశాలల్లోనూ మెగా పేరెంట్ మీట్ జరుగుతుందన్నారు. ఇందుకోసం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంసిద్ధం కావాలని వారు సూచించారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



మహిళా డిగ్రీ కళాశాలలో విదేశీ పర్యాటకులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ చలపతిరావు, అధ్యాపకులు

అరకులోయ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రం అరకులోయ సందర్శనకు విచ్చేసిన అమెరికాకు చెందిన పర్యాటకులు క్రిష్టఫర్, ఇన్స్యూరోషర్ సోమవారం స్థానిక మహిళా డిగ్రీకళాశాలను సందర్శించారు. భారతదేశ సంస్కృతి, విద్యా అంశాలు, కళాశాలలో కోర్సులు, చదువుతున్న ఆదివాసీ విద్యార్థినుల వివరాలను ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు ఈ సందర్భంగా వారికి వివరించారు. తొలుత విదేశీపర్యాటకులు విద్యార్థినులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య ఆవశ్యకత, భవిష్యత్తులో స్థిరంగా సాగేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎవరైనా విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేయాలనే వారికి తాము సహకరిస్తామన్నారు. అభివృదితో అభివృద్ధి సాధ్యమని, అందరు విద్యావంతులుగా మారాలని ఆకాంక్షించారు. భారతీయ సంస్కృతి ఎంతో గొప్పదని అన్నారు. ఈ విదేశీపర్యాటకులను కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు, అధ్యాపకబృందం సత్కరించారు.

కూటమి నేతల చొరవతో పింఛన్ మంజూరు



వృద్ధురాలికి పింఛన్ సొమ్మును అందిస్తున్న నాయకులు

అనంతగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువశోభ పంచాయతీ దిగువశోభ గ్రామానికి చెందిన కొర్రా సీతన్నకు వృద్ధాప్య పింఛన్ వచ్చేది. అయితే, ఇటీవల సీతన్న అనారోగ్యంతో మృతిచెందడంతో భార్య సొర్రుబుడ్డి ఒంటరైంది. విషయం తెలుసుకున్న టీడీపీ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మట్టం శ్యామ్, జనసేన మండలపార్టీ అధ్యక్షుడు చిట్టం మురళి స్థానిక సర్పంచ్ కొర్రా సింహాద్రి సమక్షంలో సచివాలయం సిబ్బందికి సమస్యపై విన్నవించారు. ఈ స్థితిలో మంగళవారం సొర్రుబుడ్డికి నూతనంగా మంజూరైన పింఛన్ సొమ్మును అందించారు.సచివాలయ సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

విద్యార్థులకు దుస్తులు వితరణ



చిన్నారులకు దుస్తులు అందిస్తున్న ఉపాధ్యాయురాలు ప్రశాంతి

సీలేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని మారుమూల పరమసింగవరం ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. యలమంచిలికి చెందిన ప్రశాంతి రెడీమేడ్స్ యజమాని ప్రశాంతి ఈ దుస్తులు వితరణగా ఇచ్చారు. గతంలో ప్రశాంతి ఇక్కడ టీచర్‌గా పని చేసేవారు. ఆ సమయంలో ఇక్కడ విద్యార్థులకు సరైన దుస్తులు లేకపోవడం గమనించి 50 మందికి 100 జతల దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రశాంతి మేడమ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

వేతనాలు చెల్లించకుంటే ఆందోళన ఉధృతం

జి.మాడుగుల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : హమాలీల వేతన బకాయిలు చెల్లించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.పండుబాబు హెచ్చరించారు. రెండు నెలల బకాయి వేతనాలు విడుదల చేయాలని కోరుతూ చేపడుతున్న నిరసన కార్యక్రమం మంగళవారం రెండవ రోజుకు చేరుకుంది. విధులను బహిష్కరిస్తు అధికారుల తీరును ఖండించారు. వేతనాలు చెల్లించకుంటే ఎలా జీవనం సాగించాలని ప్రశ్నించారు. సంఘం నాయకులు బాబూరావు, జి.శ్రీనుబాబు, కె.శ్రీనుబాబు, నానిబాబు పాల్గొన్నారు.

సైబర్ చట్టాలపై అవగాహన



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్ఐ పాపినాయుడు

డుంబ్రిగుడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఎస్ఐ పాపినాయుడు సూచించారు. మంగళవారం స్థానిక కస్తూర్బాలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఫోన్ల ద్వారా చాలా నేరాలు జరుగుతున్నాయని, వాట్సాప్ గ్రూపుల్లో అపరిచితవ్యక్తుల లింకులను క్లిక్ చేయవద్దన్నారు. ఓటీపీలు అడిగితే చెప్పవద్దని అన్నారు. ప్రిన్సిపాల్ భవానీ, ఉపాధ్యాయులున్నారు.

జగన్‌ను కలిసిన మండల వైసీపీ నేత



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన సూర్యనారాయణ

అనంతగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ మండల అధ్యక్షుడు కొర్రా సూర్యనారాయణ కలిశారు. ఈ సందర్భంగా అధినేతతో మండలంలో పార్టీ విషయాలపై చర్చించినట్టు సూర్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కుల్లుపాడు సమీపంలో ఒరిగిన గెమ్మెలి ఆర్టీసీ బస్సు

జి.మాడుగుల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గెమ్మెలి వెళ్తే ఆర్టీసీ బస్సుకు మంగళవారం త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు.. ఉదయం పాడేరు నుంచి బయలు దేరి జి.మాడుగుల మీదుగా గెమ్మెలి వెళ్లే బస్సు కుల్లుపాడు సమీప ఘాటీలో అదుపు తప్పి పక్కకు ఒరిగిపోయింది. జాతీయ రహదారి పనుల్లో భాగంగా బురదతో నిండిన మట్టి వల్ల ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రయాణీకులు వెంటనే కిందకు దిగిపోవడంతో ప్రమాదం తప్పింది.



శిథిలావస్థకు చేరిన చింతలపూడి అంగన్‌వాడీ కేంద్రం



భవనం శ్లాబ్‌కు రంధ్రంపడి బీటలు వారిన దృశ్యం

శిథిల స్థితిలో అంగన్‌వాడీ భవనం

- భయం భయంగా చిన్నారులకు చదువులు
- చింతలపూడిలో దయనీయ పరిస్థితి

కొయ్యూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కిందట నిర్మించిన మండలంలోని చింతలపూడి అంగన్‌వాడీ కేంద్రం భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో చిన్నారులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాల సమయంలో కేంద్రంలో ఉండేందుకు వీలుకాని దుస్థితి నెలకొంది. ఈ భవనం శ్లాబ్ బీటలు వారి చిన్నపాటి వర్షం కురిసినా లోనికి నీరు చేరుతోంది. గోడలు నానిపోయి భవనం ఏ క్షణాన కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. గడిచిన నాలుగు రోజులుగా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు ఈ భవన పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. శ్లాబ్ పూర్తిగా కారుతుండటంతో కేంద్రానికి ప్రభుత్వం సరఫరా చేసిన సామగ్రి సైతం పాడైపోతున్నాయి. అలాగే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందచేసేందుకు సరఫరా అయిన పౌష్టికాహారం నిల్వచేసేందుకు నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మూడేళ్ల కిందట ప్రపంచ బ్యాంక్ నిధులతో మరమ్మతులు చేపట్టినా ఫలితం కానరాలేదు. దీంతో శిథిల భవనంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని కార్యకర్త, చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవా కార్యక్రమాలు



రవ్వలగుడలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ పీవోలు

అరకులోయ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ బృందాలు దత్తత గ్రామాలైన రవ్వలగుడ, ఆర్.డుంబ్రిగుడల్లో సేవా కార్యక్రమాలను మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా రవ్వలగుడలో మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ ఆత్మీయ సేవా పథకం కింద దత్తత తీసుకున్న గ్రామాల్లో వలంటీర్లంతా సేవాభావంతో పనిచేయాలన్నారు. మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులంతా క్రమశిక్షణతో మెలగాలన్నారు. భవిష్యత్తులో రాణించాలన్నారు. అనంతరం స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్, మాజీ పెదలబుడు వైస్ సర్పంచ్ సత్యానంతం తదిరులు, ఎన్ఎస్ఎస్ పీవోలు నాగబాబు, విజయలక్ష్మి, అనితకుమారి, అధ్యాపకులతో కలిసి గ్రామాల్లో మొక్కలు నాటారు. ముఖ్యఅతిథులను పీవోలు సత్కరించారు.

పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యం



మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

డుంబ్రిగుడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉతీర్ణత లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖధికారి బ్రహ్మాజీరావు సూచించారు. స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలోని సమవేశ మందిరంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారుల విద్యా ప్రగతితో పాటువారి మానసిక వికాసానికి తోడ్పాటు నందించాలని అన్నారు. పదో తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండలంలో 5వ తేదీన జరగనున్న 3.0 మెగా తల్లిదండ్రుల సమావేశానికి చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు సుందరరావు, గెన్ను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- డీఈవో బ్రహ్మాజీరావు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

పాడేరురూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ విద్యపట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు సూచించారు. మంగళవారం ఆయన స్థానిక ప్రభుత్వ ఉన్న పాఠశాలలో యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ముఖ్యంగా చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. తోటి స్నేహితులు ఎవరైనా మాదకద్రవ్యాలు, చెడు వ్యసనాల వైపు ఆకర్షితులైతే వెంటనే పాఠశాల యాజమాన్యం, తరగతి ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థి దశలోనే గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితంలో ఎదురయ్యే కష్ట, నష్టాలను పవర్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. అనంతరం ఎంఈవోలు మోరి జాను, చీపురు సరస్వతిదేవి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఎక్కువ మంది పిల్లలు వ్యసనాలకు గురై చదువుకు దూరమవుతున్నారన్నారు. ఇలాంటి వాటికి దూరంగా ఉంటూ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం చల్లంగి విశ్వప్రసాద్, సెక్టోరియల్ అధికారులు రేగం కామరాజు, పాఠశాల ఉపాధ్యాయులు దిలీప్‌కుమార్, సూర్యకుమారి, నాగేంద్రబాబు, ప్రసాద్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు రాణించాలి



కె.కొడిసింగిలో ర్యాలీ చేపడుతున్న డ్వాక్రా మహిళలు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పురుషులతో సమానంగా మహిళలు రాణించాలని స్థానిక వెలుగు సీసీ రాజుబాబు అన్నారు. మండలంలోని కె.కొడిసింగి గ్రామంలో లింగ సమానత్వంపై డ్వాక్రా మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ మాట్లాడుతూ నయచేతన 4.ఓ లో భాగంగా నవంబరు 23 నుంచి డిసెంబరు 23 వరకు లింగసమానత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అన్ని రంగాల్లోనూ మహిళలకు పురుషులతో సమాన హక్కులు కల్పించాలన్నారు. పురుషులు, మహిళల మధ్య భేదాభిప్రాయాలు ఉండరాదన్నారు. మహిళలపై వివక్షత చూపరాదన్నారు. మహిళలు ఉద్యోగాలు, ఉపాధి రంగాలతోపాటూ రాజకీయాల్లోనూ రాణించాలన్నారు. మహిళల ఎదుగుదలకు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమం లో హెచ్‌డీ దుమంతి, వీవోఏ నాగమణి, సౌజన్య పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలు అందుకున్న అయ్యప్పస్వామి

పాడేరురూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులోని పూర్ణ పుష్కల అయ్యప్పస్వామి ఆలయ 33వ వార్షికోత్సవం ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సుబ్బారావు, ఆయన సోదరి స్థానిక పంచాయతీ సర్పంచ్ ఉషారాణి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న వినాయక విగ్రహంతో పాటు వెంకటేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, సత్యనారాయణ స్వామి, సోమనాథేశ్వర స్వామి, సాయిబాబా, మహాలక్ష్మి, వాసవీ మాత, సరస్వతీ దేవి తదితర దేవుళ్లకు పూజలు చేపట్టారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షులు వర్తన పిన్నయ్యదొర, కార్యదర్శి ఇమిడిశెట్టి అనీల్‌కుమార్, ఆలయ కమిటీ ప్రధాన సభ్యులు రొబ్బి రాము, వర్మ సత్తిబాబు, ఆదిత్య, కె.ఈశ్వరరావు, కె.ప్రశాంత్, బూ రెడ్డి కొండబాబు, ఉపసర్పంచ్ బూరెడ్డి రామునాయుడు, సత్తిబాబు, భీమ్‌నాయుడు, వెయ్యాకుల సత్యనారాయణ, ప్రకాష్, వి.రాజుబాబు, సయ్యపురెడ్డి రాము, గ్రామపెద్దలు, వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు.



అన్న సమారాధనలో ఆలయ ధర్మకర్త సుబ్బారావు, భక్తులు

'పెంచలయ్య హత్య కేసులో నిందితులను అరెస్టు చేయాలి'



అరకులో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న సీపీఎం, గిరిజన సంఘ నేతలు

అరకులోయ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో గంజాయి మాఫీయాకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేసిన సీపీఎం నాయకుడు, గాయకుడు పెంచలయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. పెంచలయ్య హత్యకు వ్యతిరేకంగా మంగళవారం అరకులోయలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం,ఏపీ గిరిజన సంఘం నేతలు మాట్లాడుతూ, పెంచలయ్యను గంజాయి మాఫియా అత్యంత కిరాతకంగా హత్య చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి రామారావు, నాయకులు బాలదేవ్, తాంగుల హరి, ఎస్.బాబూరావు, ఎస్.వెంకట్, సంజీవరావు, జయరాం, కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

అనంతగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువశోభ పంచాయతీ మర్రిగుడ గ్రామంలోని ఏజెన్సీ గాస్పెల్ బ్యాండ్ వెల్ఫేర్ సొసైటీ పాస్టర్స్ ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాక్య సందేశకులు డాక్టర్ రెవ. సుకుమార్ పాల్గొని యేసుక్రీస్తు జన్మదినంపై వర్తమానాన్ని అందించారు. ముందుగా చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పేదలకు చీరలు, దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాస్టర్స్ సూర్యారావు, బక్తామోహన్, పీటర్, దయానిధి, కుమార్, నీలయ్య, జోసెఫ్, డేవిడ్‌పాల్, బెన్యామిన్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ పార్కు వద్ద బోరుబావి ఏర్పాటు



బోరు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు రోష్ని

అరకులోయ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక అం బేడ్కర్‌పార్కు వద్ద జడ్పీటీసీ సభ్యురాలు శెట్టిరోష్నీ బోరుబా వి నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సేవా సంఘం ప్రతినిధులు గోవర్ధన్, సాంబశివరావు తదితరు లు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా పార్కులో బోరుబావి ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే, ఎంపీలు, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ నేపథ్యంలో జడ్పీటీసీ సభ్యురాలు శెట్టిరోష్నీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని బోరు బావికి నిధులు మంజూరు చేశారన్నారు. దీంతో నీటి సమస్య పరిష్కారమైందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ దొన్నుదొర



మాట్లాడుతున్న దొన్నుదొర, జనసేన నేతలు మురళీ, శెట్టి బాబూరావు

అనంతగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గస్థాయిలో గ్రీవెన్సు నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ సియ్యారి దొన్నుదొర తెలిపారు. మండల కేంద్రంలోని జనసేన మండలపార్టీ అధ్యక్షుడు చిట్టం మురళీతో కలిసి ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు.

5న అనంతగిరిలో గ్రీవెన్స్

ఈ నెల 5వతేదీ శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా గ్రీవెన్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. మండలంలోని 24 పంచాయతీలకు చెందిన గిరిజనులనుంచి అర్జీలను స్వీకరించి, సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించేవిధంగా చర్యలు చేపడతామని చెప్పారు. ప్రజలకు మరింత సుపరిపాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అలాగే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరకువేలి టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మట్టం శ్యామ్, శంకరరావు, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ గిరిజన యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ

- సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసన్



వృత్తినైపుణ్య శిక్షణకు ఎంపికైన యువతీ, యువకులతో సీఆర్‌పీఎఫ్ అధికారులు

చింతపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ గిరిజన యువతకు వృత్తి నైపుణ్యా కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నట్టు సీఆర్‌పీఎఫ్ 234 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్. శ్రీనివాసన్ అన్నారు. మంగళవారం ఈ కోర్సు శిక్షణకు ఎంపికైన గిరిజన యువతీ,యువకులను విశాఖపట్నం సీఎంసీ ల్యాబరేటరీస్‌కి పంపించారు. ఈసందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ మాట్లాడు తూ సివిక్ యాక్షన్ కార్యక్రమంలో భాగంగా సీఆర్‌పీఎఫ్ 234 బెటాలియన్ కమాండెంట్ మనోజ్ కుమార్ యాదవ్ జాతీయ వృత్తి నైపుణ్య అభివృద్ధి సంస్థ(ఎన్ఎస్‌డీసీ) ద్వారా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారన్నారు. విద్యార్హతలు ఆధారంగా చింతపల్లి, జీకేవీధి, పెదవలస, గుర్తేడు, రాళ్లగెడ్డ పోలీసు స్టేషన్‌ల పరిధి నుంచి 15మంది యువతులు, 25మంది యువకులను ఎంపిక చేశామన్నారు. వీరిని సీఆర్‌పీఎఫ్ వాహనంలో విశాఖపట్నం తీసుకు వెళ్లామన్నారు. మూడు నెలలపాటు ఉపకారవేతనం, భోజన, వసతి కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ సీఎంసీ ల్యాబరేటరీ డాక్టర్ జగదీశ్‌రావు, డాక్టర్ ఐ ఎస్‌రావు, స్థానిక సీఐ ఎం. వినోద్‌బాబు, ఎస్ఐ వెంకటేశ్వరరావు, సీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ అయ్యప్పన్ పాల్గొన్నారు.

బాలికల విద్యపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



వృత్తినైపుణ్య శిక్షణకు ఎంపికైన యువతీ, యువకులతో సీఆర్‌పీఎఫ్ అధికారులు

చింతపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్యపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వాసవ్య మహిళా మండలి ప్రాజెక్టు డైరెక్టర్ సునీత అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈవో వీబీవీవీ ప్రసాద్ అధ్యక్షతన బాలికల విద్య ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా సునీత మాట్లాడుతూ బాలికల హక్కులను కాపాడుతూ స్వేచ్ఛగా ప్రతి విద్యార్థినీ విద్యాభ్యాసం చేసేలా ప్రోత్సహించాలన్నారు. చదువు మధ్యలో విడిచిపెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలికలను విద్యను విడిచిపెడితే తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేసి తిరిగి పాఠశాలలో చేర్పించాలన్నారు. చిన్నారులు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాలన్నారు. స్కూల్ కమిటీలను బలోపేతం చేయాలన్నారు. పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలని కోరారు. విద్యార్థుల విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలపాలన్నారు. విద్యార్థి దశ నుంచే బాలికల నాయకత్వాన్ని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 గెమ్మెలి బోడం నాయుడు, ప్రధానోపాధ్యాయులు బీఎస్ఎన్ రాజు, జె. లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు.

'పేదల సంక్షేమమే పరమావధిగా కూటమి పాలన'



డయాలసిస్ బాధితుడికి పింఛన్‌ను అందిస్తున్న టీడీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు

పాడేరురూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని టీడీపీ నాయకులు అ న్నారు. పాడేరులో డయాలసిస్‌తో బాధపడుతున్న బాధితుడు రమేశ్‌కు రూ. 5 వేల పింఛన్‌ను ఈ నెలలో కొత్తగా మంజూరైంది. గుడివాడ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ నరేంద్రతో కలిసి బాధితుడికి టీడీపీ నాయకులు పింఛన్ సొమ్ము మంగళవారం అందించారు. పింఛన్ మంజూరుపై రమేశ్ కుటుంబ స భ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గంగపూజారి శివకుమార్, ఐటీడీపీ ని యోజకవర్గ ఇన్‌చార్జి, 13వ వార్డు సభ్యుడు బుద్ద జ్యోతికిరణ్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి డప్పోడి వెంకటరమణ పాల్గొన్నారు.

నిండు గర్భిణికి పుట్టెడు కష్టం

- రహదారి లేక కిలో మీటరు మేర నడక..మార్గమధ్యంలో ప్రసవం
- అనంతరం ఆస్పత్రికి తరలింపు.. తల్లీబిడ్డా క్షేమం



ప్రసవం అనంతరం సబితను కాలినడకన 108 వాహనం వద్దకు కుటుంబ సభ్యులు

ముంచంగిపుట్టు,డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిండు గర్భిణీ నరకాన్ని చూసింది. పురిటి నొప్పులతోనే కొండలు, గుట్టలపై నడుకుకుంటూ రావడంతో మార్గం మధ్యలో ప్రసవమైంది. వివరాలివి.. మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ పాత పెద్దాపుట్టు గ్రామానికి చెందిన గర్భిణి ఎస్.సబితకు మంగళవారం మధ్యాహ్నం పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేశారు. రహదారి ఉన్న వరకు ఆ వాహనం వచ్చింది, పాత పెద్దాపుట్టు నుంచి సుమారు కిలోమీటరు నడిస్తే గానీ ప్రధాన రహదారికి చేరుకోలేని పరిస్థితి. దీంతో సబితను భర్త కామేశ్వరరావు కుటుంబ సభ్యులు నడిపించుకుంటూ వస్తున్న క్రమంలో ఆమెకు నొప్పులు అధికమై మార్గం మధ్యంలోనే ప్రసవం అయింది. అనంతరం కుటుంబ సభ్యులు తల్లిబిడ్డను 108 అత్యవసర వాహనం వరకు తీసుకు వచ్చి, అందులో ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తరలించారు. ప్రస్తుతం తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారు. సుమారు కిలోమీటరు రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర సమయాల్లో ఇబ్బందులు పడుతున్నట్టు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించే విధంగా చూడాలని కోరుతున్నారు.

బేకరీలో అగ్ని ప్రమాదం


బేకరీ దుకాణం నుంచి వస్తున్న పొగలు

నర్సీపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం శారదానగర్ పోస్ట్ ఆఫీసు ఎదురుగా బేకరీ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. బేకరీ షాపు యజమాని రుత్తల పాత్రుడు సోమవారం రాత్రి 10 గంటల సమయంలో రోజు మాదిరిగానే షాపు కట్టేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం వేకువ జాము 5.30 గంటలకు షాపులోంచి మంటలు వస్తున్నాయని ఆయనకు స్థానికులు సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఫ్రిజ్‌లు, కేకులు తయారీ సామగ్రి, ఫర్నిచర్ మంటలో కాలి బూడిదయ్యాయి. రూ.5 లక్షలు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చునని అగ్నిమాపక అధికారులు అంచనా వేశారు.

పీఎంఏవైకు 915 మంది దరఖాస్తు

మాకవరపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకానికి 915 మంది దరఖాస్తు చేశారని గృహ నిర్మాణ శాఖ ఏఈ గౌతమ్ చెప్పారు. ప్రస్తుతం అర్హత కలిగిన వారి పేర్లు జాబితాను తయారు చేసి పంపించాలంటూ ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసిందని ఆయన తెలిపారు. ఈ మేరకు మండలంలోని 31 పంచాయతీల పరిధిలో సొంతి ఇంటి స్థలం ఉండి ఇల్లు నిర్మింకోవాడానికి సిద్ధంగా ఉన్నవారి జాబితాను క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి వివరాలను సేకరిస్తున్నామని చెప్పారు. ఈ నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపామని ఆయన తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర

నర్సీపట్నం అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెద బొడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూర్యచంద్ర మంగళవారం స్టడీ మెటీరియల్ అందించారు. పదో తరగతి విద్యార్థులకు ఈ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూవిద్యార్థులు విద్యాపరంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అల్లాడ సురేశ్, నాయకుడు పంచాడ హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

5న జోగంపేటలో మెగా పేరెంట్స్ సభ

గొలుగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జోగంపేట ఉన్నత పాఠశాలలో ఈ నెల 5న మెగా పేరెంట్స్ సభ నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ, హెచ్‌ఎం నాగభూషణం ఏర్పాట్లను పరిశీలించారని చెప్పారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు హాజరవుతారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ జి.మురళి పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌కు బలిఘట్టం భూముల లీజు

ఎకరాకు రూ.31 వేలు చొప్పున దేవదాయ శాఖకు ఆదాయం

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంటకటరమణ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ రమణ

నర్సీపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం సత్యనారాయణస్వామి ఆలయానికి సంబంధించి 30 ఎకరాల భూములను సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి మెగా సంస్థకు లీజుకు ఇస్తున్నారని ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎకరాకు రూ.31 వేలు చొప్పున 30 ఎకరాలకు సంవత్సరానికి రూ.9.30 లక్షల ఆదాయం సమకూరుతున్నదన్నారు. గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే గణేశ్ అనుచరులు 30 ఎకరాలకు నామమాత్రంగా రూ.12 వేలు, రూ.30 వేలు లీజు చెల్లించి అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరిపారని ఆరోపించారు. తద్వారా లక్షలు రూపాయలు వెనకేసుకున్నారన్నారు. నియోజకవర్గంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మాకవరపాలెంలో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్, భారీ యంత్ర సామగ్రి తయారీ పరిశ్రమ, ఎంఎస్‌ఎంఈ పార్కు తీసుకు వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు రుత్తల కృష్ణ, టీడీపీ పట్టణ కార్యదర్శి లాలం మురళీకృష్ణ, మాజీ కౌన్సిలర్ పైల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

పెంచలయ్య హత్యపై ఐద్వా నిరసన

నర్సీపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ప్రజా నాట్య మండలి యువ కళాకారుడు పెంచలయ్య హత్యకు నిరసనగా ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. మంగళవారం పాల్‌ఘాట్ సెంటర్‌లో కొవ్వొతులతో ర్యాలీ చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు ఎల్.గౌరీ, కేవీ.సూర్య ప్రభ మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాల వ్యాపారులు తమ కార్యకలాపాలకు అడ్డుగా ఉన్నాడన్న కారణంతోనే పెంచలయ్యను హత్య చేశారన్నారు. స్కూల్ నుంచి పిల్లలను తీసుకువస్తుండగా దారి కాచి నరికి హతమార్చడాన్ని ఐద్వా తీవ్రంగా ఖండిస్తున్నదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు త్రిమూర్తులురెడ్డి, కేవీపీఎస్ కార్యదర్శి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామి భూముల్లో అక్రమంగా సోలార్ విద్యుత్ ప్లాంట్

▸▸ మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్

నర్సీపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం సత్యనారాయణ స్వామికి సంబంధించిన రూ.15 కోట్ల విలువ చేసే భూములలో అక్రమంగా సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ ఆరోపించారు. వైసీపీ నేతలతో కలిసి మంగళవారం సోలార్ విద్యుత్ కోసం జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణస్వామికి బలిఘట్టంలో సర్వే నంబరు 647, 648లో 18 ఎకరాలు, 12.2 ఎకరాలు చొప్పున భూములు ఉన్నాయని తెలిపారు. రూ.15 కోట్లు విలువ చేసే స్వామివారి భూములలో అక్రమంగా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవోకు, డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేశ్

ఏరియా ఆస్పత్రిలో కాయకల్ప చికిత్స బృందం తనిఖీలు


ఏరియా ఆస్పత్రిని పరిశీలిస్తున్న కాయకల్ప బృందం ప్రతినిధులు

నర్సీపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాయకల్ప పీర్ అస్సెస్‌మెంట్ బృందం ప్రాంతీయ ఆస్పత్రిని సందర్శించారు. విజయనగరం జిల్లా చల్లపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చైతన్య, క్వాలిటీ మేనేజర్ డాక్టర్ కుప్పిలి శ్రీనివాసరావు ఏరియా ఆస్పత్రిలోని పలు విభాగాలు మంగళవారం తనిఖీలు చేశారు. ఇంకుడు గొయ్యి, హెర్బల్ గార్డెన్, బయోవేస్ట్ యూనిట్, మార్చురీ విభాగం, వంటశాల, ఓపీ, శస్త్ర చికిత్స, అత్యవసర విభాగం, పురుషులు, స్త్రీల వార్డులు, రక్త కేంద్రం తదితర విభాగాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారద, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

▸▸ 17.6 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

కొత్తూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని కొప్పాక గ్రామంలో ఈ ఏడాది మార్చిలో జరిగిన దొంగతనం కేసులో నిందితుడిని అరెస్టు చేశామని అనకాపల్లి రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సబ్బవరంలోని సాయినగర్‌లో నివాసం ఉంటున్న గేదెల రాజశేఖర్ అనకాపల్లి మండలం కొప్పాక గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటిలోకి చొరబడి చోరీ చేశాడన్నారు. ఈ విధంగా దఫదఫాలుగా చోరీ చేసిన సొత్తును అమ్ముతున్న సమయంలో పట్టుకున్నామని తెలిపారు. ఎస్‌ఐ రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం సిరసపల్లి బస్టాప్ దగ్గరలో విశ్వసనీయ సమాచారం మేరకు రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. ఆయన నుంచి ఒక నక్లెస్, ఒక బంగారు ఉంగరం, ఒక జత చెవి దిద్దులు కలిపి మొత్తం 17.6 గ్రాములు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు రాజశేఖర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

జ్యోతిర్మయి బాబా శత జయంతి రేపు


ఉత్సవాల గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న గంటా శ్రీనివాసరావు

బుచ్చెయ్యపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మలపూడి శివారు అమరపురిలో విశ్వశాంతి జ్యోతిర్మయి బాబా శత జయంతి ఉత్సవాలను ఈనెల 4వ తేదీన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుని కలిసి 4న హాజరు కావాలని కోరారు. అనంతరం ఉత్సవాల గోడపత్రికను గంటా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, కేఎస్ఎన్ఎస్ రాజు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో బాబా ట్రస్ట్ సభ్యులు, టీడీపీ మండల నాయకులు ఎంవీవీ సత్యనారాయణ, డొంకిన అప్పలనాయుడు, గోకివాడ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

స్నేహితుడికి బాసటగా నిలిచిన యువకులు

బుచ్చెయ్యపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతయ్యపేటలో కాండ్రకోట శ్రీను తండ్రి అనారోగ్యం బారిన పడ్డాడు. దీంతో శ్రీను ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయం తెలిసిన అతని స్నేహితులు శ్రీనుకు రూ.22 వేల నగదును సోమవారం రాత్రి సీతయ్యపేట యువసేన సభ్యులు అందించారు. ఈ కార్యక్రమంలో సీఎం శివ, వై. శ్రీను, టి.రాజు, ఎం. సతీష్, వి. లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా సీఎం సహాయనిధి

రోలుగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిరుపేద బాధితులకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు అన్నారు. మంగళవారం జనసేన పార్టీ కార్యాలయంలో బాధితుడుకి రూ.60వేల చెక్‌ను అందజేశారు. మండలంలోని బలిజిపాలెం గ్రామానికి చెందిన గోకాడ రాజు అనారోగ్యానికి గురై ఆసుపత్రి చికిత్స పొందారు. చికిత్సకు పెద్దమొత్తంలో ఖర్చు అయ్యింది. ఈ మేరకు జనసేన మండల అధ్యక్షుడు బలిజి మహారాజు నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సీఎం సహాయ నిధి మంజూరుకు కృషి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బలిజి సన్యాసిరావు, బుంగా కోటి, కేసరపూడి శివాజీ, దాసరి చినబ్బాయి, మాశాడ శ్రీను, పరవాడ దొరబాబు, జగ్గునాయుడు పాల్గొన్నారు.

పథకాలు, ఆరోగ్య సేవలపై అవగాహన

రోలుగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో క్షయ రోగులు, కుష్ఠు రోగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఉన్న వారిని గుర్తించి ఆరోగ్య కేంద్రాలకు తీసుకువచ్చి చికిత్స అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వీరజ్యోతి ఆశాలను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన ఆశ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆశా కార్యకర్తలు ఆరోగ్య పథకాలు, ఆరోగ్య సేవలు గురించి క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. గర్భిణులు నెలవారీ టీకాలు వేయించుకుంటున్నారా లేదా మందులు తీసుకుంటున్నారా లేదా అని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి మజీదా బేగం, ఎంపీహెచ్‌ఈఓ కృష్ణ, గోవిందు, హెచ్ఎస్ షాజహాన్ పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా కోటేశ్వరరావు

చీడికాడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ డిప్యూటీ ఎంపీడీవోగా కోటేశ్వరరావు మంగళవారం విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేసిన డిప్యూటీ ఎంపీడీవో ప్రమోషన్‌పై వెళ్లడంతో ఆ పోస్టు ఖాళీ ఏర్పడింది. బుచ్చెయ్యపేట మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న కోటేశ్వరరావు ప్రమోషన్‌పై ఇక్కడ డిప్యూటీ ఎంపీడీవోగా నియమించారు.

విశ్వకర్మ లబ్ధిదారులకు ఉదారంగా రుణాలివ్వాలి : ఎమ్మెల్యే రాజు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ పథకం లబ్ధిదారులకు బ్యాంకర్లు ఉదారంగా రుణాలు ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు బ్యాంకర్లకు విజ్ఞప్తిచేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల కల్పన శాఖ, పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో విశ్వకర్మ పథకం లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన సమావేశం ఆయన మాట్లాడారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు రుణాల మంజూరుతో బ్యాంకర్లు ఆటంకాలు పెట్టకుండా మంజూరు చేయాలన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం వీకేపీ ప్రసాద్ మాట్లాడుతూ, చిన్న తరహా వ్యాపారాలు చేసేవారికి అవసరమైన సాంకేతిక, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పిస్తామని, రుణాల విషయంలో తలెత్తే ఇబ్బందుల పరిష్కారంలో కూడా సహకారం అందించనున్నామన్నారు. ఈ సమావేశంలో సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమల కల్పన కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ అప్పికొండ శ్రీను, జిల్లా అధికారి గోవింద్, పోస్టల్ శాఖ అధికారి శృతి, కామన్ సర్వీస్ సెంటరు ఇన్‌చార్జి జగదీశ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి డీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


తెగుళ్లుసోకిన శిరిజాం పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చీడికాడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వరి పంటపై సోకిన తెగుళ్లను నివారించడానికి వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేవీకే కొండెంపూడి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎన్.రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని శిరిజాంలో గల రైతుల పొలాలను కొన్నెంపూడి నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు డా.ఎన్.సత్తిబాబు, డా.ఎ.సౌజన్య, డా.కిశోర్‌కుమార్, స్థానిక వ్యవసాయ అధికారి ఎ.కృష్ణవేణితో కలిసి మంగళవారం శిరిజాం రైతుల పొలాలను పరిశీలించారు. ప్రస్తుతం వరి పంటపై రెల్లరాల్చు పురుగు, మానిపండు తెగులు సోకాయని, వీటి నివారణకు రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ తెగుళ్ల ఆశించడంతో ధాన్యంలో నాణ్యత ప్రమాణం తగ్గుతుందన్నారు. నివారణకు ప్రాపికొనజోల్ ఒక మిల్లీలీటరు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఉధృతి ఎక్కువైతే వరి పంట దిగుబడులు ఘననీయంగా తగ్గిపోతాయని అన్నారు. అలాగే పురుగును గమనించిన వెంటనే నివారణకు పిప్రొనిల్ రెండు మిల్లీలీటర్లు లేదా క్లోరిపైరిపాస్ 1.5మిల్లీలీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ విధంగా చేస్తే తొలి దశలోనే పురుగు ఉధృతిని తగ్గించవచ్చునన్నారు.

తట్టబంద కూడలిలో ఆక్రమణల తొలగింపు

రావికమతం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తట్టబంద కూడలిలో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా వెలసిన ఆక్రమణలను మంగళవారం ఆర్అండ్‌బీ, రెవెన్యూ, పోలీసుల పర్యవేక్షణలో తొలగించారు. నాలుగు వైపులా ఈ కూడలిలో వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డును ఆనుకొని ఇరువైపులా ఉన్న ఆర్అండ్‌బీ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఈ కూడలి ఇరుకుగా మారింది. ఈ నేపథ్యంలో కూడలిలో ఆక్రమణలను తొలగించాలని తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ ఆర్అండ్‌బీ, రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇటీవల ఈ ఆక్రమణలపై అధికారులు సర్వే నిర్వహించారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగిపోవాలని ఇటీవల నోటీసులు జారీ చేశారు. దీనిపై ఆక్రమణదారులు స్పందించకపోవడంతో సోమవారం ఆక్రమణల తొలగింపునకు సంబంధించి ఆర్డర్ కాపీలు (6 నోటీసు) అందించారు. మంగళవారం తహశీల్దార్ ఎస్వీఅంబేడ్కర్, ఆర్అండ్‌బీ మాడుగుల సెక్షన్ జేఈ సాయిశ్రీనివాస్, సర్వే సిబ్బంది, రావికమతం పోలీసుల బందోబస్తుతో తట్టబంద కూడలిలో ఆర్అండ్‌బీలో ఉన్న ఆక్రమణలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఈ సందర్భంగా ఎటువంటి గొడవలకు ఆస్కారం లేకుండా రావికమతం ఎస్ఐ ఎం.రఘువర్మ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


తట్టబంద కూడలిలో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

గిరిజన పంచాయతీ ఏర్పాటుచేయాలని వినతి

మాడుగుల రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గిరిజన గ్రామాల వారు తమకు ప్రత్యేకంగా కొత్త గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం డీటీ రాజాకు వినతిపత్రాన్ని ఇచ్చారు. జాలంపల్లి పంచాయతీ పరిధిలోని కామకూటం, బందవీధి, కొండవీధి, అలాగే లోవ పొన్నవోలు పంచాయతీ పరిధిలోని లోవ కృష్ణాపురం, గడబవీధి, ఓంద్రు వీధి, జమ్మాదేవిపేట పంచాయతీ పరిధిలోని లోవ గవరవరం, కొండలపాడు గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాలు సమీపాన ఉన్నాయని, వేర్వేరు పంచాయతీల్లో ఉండడంతో కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నామని గిరిజనులు చెబుతున్నారు. ఈ ఎనిమిది గిరిజన గ్రామాలు పూర్తిగా గిరిజనులే ఉన్నారని, వీటితో కొత్తగా గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పై గ్రామాల్లో 1599 మంది జనాభా, 1127 ఓట్లు, 3400 ఎకరాల విస్తీర్ణం గల భూమి ఉన్నదని వినతి పత్రంలో పేర్కొన్నారు. పాలకులు, అధికారులు స్పందించి తమకు కొత్తగా గ్రామ పంచాయతీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సాగాని గంగరాజు, అప్పారావు(పవన్), దేముడు పాల్గొన్నారు.

పెద్దేరు నుంచి 300 క్యూసెక్కులు విడుదల

మాడుగుల రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పెద్దేరు జలాశయం నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరువగా ఉంది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా మంగళవారం సాయంత్రానికి 136.25మీటర్లకి చేరింది. ఇన్‌ఫ్లో 493 క్యూసెక్కులు నమోదైందని రాత్రి తొమ్మిది గంటలకు జలశయం మూడో నంబరు గేటు తెరిచి 300 క్యూసెక్కులు నీరు విడిచిపెట్టినట్లు జలాశయం ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించిన డీఈవో


పిల్లలను పాఠశాలలో చేర్పించిన డీఈవో అప్పారావు నాయుడు

దేవరాపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి మచిలీపట్నం నుంచి వలస వచ్చి శారదా నది ఒడ్డున ఉంటూ చెత్తలో ప్లాస్టిక్, బాటిల్‌లు, ఐరన్ ముక్కలు ఏరుకుంటూ జీవనం సాగిస్తున్న రెండు కుటుంబాలకు చెందిన ముగ్గురు పిల్లలను జిల్లా విద్యాశాఖ అధికారి అప్పారావునాయుడు మంగళవారం బడిలో స్వయంగా చేరించారు. వారిని తన కారులో తీసుకు వెళ్లి పాఠశాలలో చేర్పించారు. మేరీని అంగన్‌వాడీలోను, అక్కమ్మ, అన్నమ్మ పాఠశాలలో చేర్పించారు. అలాగే తామరబ్బ పాఠశాలకు అదనంగా ఉపాధ్యాయులను నియమించాలని డీఈఓ అప్పారావు నాయుడును సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డివెంకన్న కోరారు.

గాంధీగ్రామంలో ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం


ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం ర్యాలీని ప్రారంభిస్తున్న డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్

చోడవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీ గ్రామం పంచాయతీలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ల విద్యార్థులు సేవా శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్‌కుమార్, గాంధీ గ్రామం సర్పంచ్ గాడి అప్పారావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల కో-ఆర్డినేటర్లు మాల్యాద్రి, బిచ్చమ్మ, రత్నభారతి, రిటైర్డ్ లెక్చరర్ ఎన్. దేముడు, వైస్ ప్రిన్సిపాల్ ఐవీ సత్యవతి, కో-ఆర్డినేటర్ నారాయణమూర్తి పాల్గొన్నారు.

తెలుగు మహిళ మండల అధ్యక్షురాలుగా కర్రి పుష్ప


ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తిని సత్కరిస్తున్న కర్రి పుష్ప దంపతులు

దేవరాపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు మహిళా మండల అధ్యక్షురాలుగా కర్రి పుష్ప నియమితులయ్యారు. మంగళవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని ఆమె శాలువతో సత్కరించారు. నాగయ్యపేట సర్పంచ్ పుష్ప విద్యావంతురాలు కావడంతో పాటు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కలగడంతో ఆమెను పార్టీ గుర్తించి ఈ పదవి ఇచ్చారు. మండలంలోని నాయకులు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కర్రి పుష్ప కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హుందరికీ పథకాలు అందే విధంగా చేస్తానన్నారు. పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఆమె భర్త కర్రి దేముళ్లు పాల్గొన్నారు.

'జీఎఫ్ఎల్ఎన్ సర్వే పక్కాగా నిర్వహించాలి'


సర్వేపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ మహేష్

రావికమతం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు నిర్వహించే జీఎఫ్ఎల్ఎన్ సర్వేను ఎటువంటి ఆరోపణలకు తావులేకుండా నిర్వహించాలని ఎంపీడీవో మహేష్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం విద్యాశాఖ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక స్థాయి విద్యార్థుల అక్షరాస్యత, గణితం, సంఖ్యాశాస్త్రం సామర్థ్యంపై ఈ సర్వే చేపట్టినట్టు చెప్పారు. మండలంలో 60 పాఠశాలల్లో 1,818 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. సర్వే కోసం వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, సచివాలయ సిబ్బందిని నియమించామన్నారు. సర్వే వివరాలు విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ఎం.లింగ మూర్తి, ఎన్. బ్రహ్మాజీ పాల్గొన్నారు.

రెండు రోజులైనా అందని రేషన్ సరుకులు

▸▸ ఇబ్బందులు పడుతున్న దళిత మహిళలు


రేషన్ కోసం కోనాం డిపో వద్ద వేచిచూస్తున్న మహిళలు

చీడికాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కోనాం రేషన్ డిపో తెరవకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని పలువురు దళిత మహిళలు, దళిత సంఘం నాయకుడు మట్టా బాబురావు ఆవేదన వ్యక్తంచేశారు. కోనాం రేషన్ డిపో వద్ద సరుకుల కోసం రాగా డిపో తెరవలేదు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతి నెలా 1వ తేదీ నుంచే రేషన్ సరుకులు ఇవ్వాలని ఆదేశించినా రెండు రోజులుగా తెరవలేదన్నారు. బుధవారం ఉదయం నుంచి అయినా సరుకులు ఇవ్వకుంటే డిపో వద్ద ఆందోళన చేస్తామన్నారు. ఈ విషయమై తహశీల్దార్ కిషోర్‌లింకన్‌ని వివరణ కోరగా.. ఇక్కడి రేషన్ డీలర్‌పై 6ఎ కేసు నమోదు చేయగా ఇన్‌చార్జి బాధ్యతలు మంచాల డిపో డీలర్‌కి అప్పగించామన్నారు. ఈనెల నుంచి ఎ.అగ్రహారం డీలర్‌కి ఇన్‌చార్జి బాధ్యతలు మంగళవారం ఉదయాన్నే అప్పగించామని, మధ్యాహ్నం నుంచి డిపో తెరవాలని ఆదేశించామన్నారు


ప్రతిభ కనబరిచిన విద్యార్థి రోహిత్‌కి అభినందన

మాడుగుల రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మాడుగుల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థి పుట్టా రోహిత్ చిత్రలేఖనం పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఇటీవల చెన్నయ్‌లోని శ్రీదర్శిని కళాయి కూడమ్ సంస్థ నిర్వహించిన 21వ వార్షికోత్సవ చిత్రలేఖనం పోటీల్లో చోడవరం చిత్ర కళా నిలయానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు మెడల్స్ సాధించారు. ఈ పోటీల్లో చోడవరం చిత్ర కళానిలయం తరుపున రోహిత్ పాల్గొని గోల్డ్ మెడల్ సాధించి ప్రతిభ కనబరిచాడు. మంగళవారం పాఠశాల హెచ్‌ఎం బండారు ముత్యాలనాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జొన్నపల్లి రమేశ్, ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచిన రోహిత్‌ని అభినందించారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.



కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను

- సంయుక్త



'అఖండ 2: తాండవం' చిత్రంలో అవకాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సినిమాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటుడిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకూ మహారాజ్' నా ఫేవరేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడలేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.

అఖండ 2
టికెట్ ధరల పెంపు
- ఏపీ ప్రభుత్వ అనుమతి

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతిచ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్ర్కీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా



క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపుదిద్దుకున్న చిత్రం 'గోట్'. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగళవారం నిర్మాత దిల్‌రాజు టీజర్‌ను విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

యువతకు కనెక్ట్ అయ్యే కథ



రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథా చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాదరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్ర్కీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

అనుమాన పక్షి వచ్చేది అప్పుడే



రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫొటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథా నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

కాంతారపై కామెడీ
రణ్‌వీర్ క్షమాపణలు



కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశాలను ఎంతో ఈజ్‌తో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతార'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార' సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సినిమాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చాడని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

వినూత్నంగా వన్ బై ఫోర్



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. 'హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్' అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

విడుదలకు సిద్ధం



భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.

5న నర్సీపట్నంలో మెగా జాబ్‌మేళా

నర్సీపట్నం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 5న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. స్కిల్ హబ్ సమన్వయకర్త శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళలో 12 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, 1,500 ఉద్యోగాలు భర్తీ చేయడానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.

చెరకు పరిశోధకులకు జాతీయ సదస్సులో ప్రశంసలు

» బెల్లం ఆధారిత ఉత్పత్తుల పరిశీలనకు త్వరలో వస్తామని ప్రముఖుల వెల్లడి

అనకాపల్లి అగ్రికల్చర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అసోం రాష్ట్రం జోర్‌హాట్‌లో ఇటీవల జరిగిన అఖిల భారత చెరకు సమన్వయ పరిశోధన పథకం వార్షిక సమావేశంలో భారత వ్యవసాయ పరిశోధన మండలి ఉన్నతాధికారులు అనకాపల్లి చెరకు పరిశోధనలను కొనియాడారు. అనకాపల్లి పరిశోధన స్థానంలో బెల్లంపై జరుగుతున్న పరిశోధనలు, బెల్లం ఆధారిత ఉత్పత్తులను పరిశీలించేందుకు త్వరలో ఆర్ఏఆర్ఎస్‌ను సందర్శిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు మేలు రకం చెరకు వంగడాలను రూపొందించడంలో చేస్తున్న కృషికి జాతీయస్థాయిలో ప్రశంసలు లభించాయి. ఇంతవరకు 21 మేలు రకం చెరకు వంగడాలను రూపొందించగా, ప్రస్తుతం మూడు చెరకు రకాలు జాతీయ స్థాయిలో, రెండు రకాలు రాష్ట్ర స్థాయిలో పరిశీలనలో ఉన్నాయి. ఇవికాక మరో రెండు కొత్త రకాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత నెల 27, 28 తేదీల్లో అసోం రాష్ట్రం జోర్‌హాట్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన అఖిల భారత చెరకు సమన్వయ పరిశోధన పథకం వార్షిక సమావేశానికి అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్‌కు చెందిన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మి, శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ భవాని తదితరులు హాజరయ్యారు. చెరకు తోటల్లో బోదెలను ఎగదోసే యంత్ర పరికరాన్ని రూపొందించి, పేటెంట్ పొందిన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.ఆదిలక్ష్మిని వ్యవసాయ పరిశోధన మండలి అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ప్రధాన్, వాణిజ్య పంటల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ప్రశాంత్ దాస్ అభినందించారు. పరిశోధక గ్రంథాలు, వ్యాసాలను ప్రచురించడంలో కూడా మంచి కృషి జరుగుతున్నదని అన్నారు.



అసోంలోని జోర్‌హాట్‌లో జరిగిన అఖిల భారత చెరకు సమన్వయ పరిశోధన పథకం సమావేశానికి హాజరైన అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు

పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

» కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో విద్యా శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థుల హాజరు, పరీక్షల ముందస్తు ప్రణాళిక, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాల గురించి చర్చించారు. వసతిగృహాల్లో వుంటున్న విద్యార్థులను సంక్రాంతి సెలవుల్లో మినహా మిగిలిన రోజుల్లో ఇళ్లకు పంపవద్దని, రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వార్డెన్లు దగ్గరుండి చదివించాలని చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సబ్జెక్టుల వారీగా శిక్షణ అందించాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

రాచపల్లి రైతులకు ఊరట

... 3వ పేజీ తరువాయి

రాయితీ రుణాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి, సమగ్ర విచారణ జరపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించినట్టు పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ పాత రికార్డులన్నీ పరిశీలించి జిరాయితీ భూములను తిరిగి రైతులకు అప్పగిస్తూ ఉత్తర్వులు (ఆర్‌సీ నంబరు 1219/2025/డి3) జారీ చేశారని తెలిపారు. ఆర్డీవో, తహశీల్దారు క్షేత్రస్థాయిలో పరిశీలించి 246 మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేసి, అన్నదాత సుఖీభవ పథకం కింద సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు చెప్పారు. అల్యూమినియం కంపెనీ ఏర్పాటు కోసం భూములు కోల్పోయిన రైతుల కుటుంబాలకు, స్థానికులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని షరతు విధించినట్టు అయ్యన్నపాత్రుడు తెలిపారు. నిర్వాసిత కాలనీలో రోడ్లు, డ్రైనేజీకాలువల నిర్మాణం, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల పనులు వెంటనే పూర్తి చేయాలని అన్నారు. సమావేశంలో ఆర్డీవో వీవీ రమణ, నర్సీపట్నం, మాకవరపాలెం తహశీల్దార్లు రామారావు, వెంకటరమణ, టీడీపీ మాకవరపాలెం మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు నాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీటీడీ చిన్నచూపు

... 3వ పేజీ తరువాయి

స్థానిక ఆలయ అధికారులు చేతులెత్తేస్తున్నారు.

చేయాల్సిన పనులు

- కొండపై స్వామివారి నిజరూపమున్న గర్భగుడి, ఆస్థాన మండపాన్ని నిర్మించాలి.
- రాతితో స్వామివారి నిజరూపాన్ని కొండపై ప్రతిష్ఠించాలి
- పుష్కరిణిని అందంగా తీర్చి దిద్ది, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి.
- అన్ని వసతులతో నూతన కల్యాణ మండపాన్ని అందుబాటులోకి తేవాలి
- భక్తులకు నిరంతరం మంచినీటి సరఫరా
- ఉత్సవాలను ఘనంగా జరిపేందుకు ముందుగా నిధుల కేటాయింపు
- తిరుమల లడ్డూ ప్రసాదాలు, టికెట్ల విక్రయ కౌంటర్ల ఏర్పాటు
- ఆగమ శాస్త్ర ప్రకారం పండితులు సూచించిన పలు నిర్మాణాలు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఎలమంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లవరం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి విశాఖలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. రూరల్ ఎస్ఐ ఉపేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖలో సీతమ్మధారకు చెందిన షేక్ సుభాన్ (69) గత నెల 30వ తేదీన బైక్‌పై ఎలమంచిలి నుంచి రేగుపాలెం వైపు వెళుతున్నాడు. ఇదే సమయంలో మల్లవరం వద్ద ట్రాఫిక్ ఎస్ఐ తనిఖీలు నిర్వహిస్తున్నారు. దీంతో సుభాన్ బైక్‌ను వెనక్కు మళ్లించే ప్రయత్నంలో అటుగా వస్తున్న స్కూటీని ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్రగాయమైంది. స్కూటీపై ప్రయాణిస్తున్న మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం విశాఖలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, సుభాన్ పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతిచెందాడు. ఇతని బంధువు మహమ్మద్ ఖాజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ భూముల్లో పాగా

... 3వ పేజీ తరువాయి

ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చారు. కానీ నివాస యోగ్యంకాని భూముల్లో స్థలాలు ఇవ్వడంతో చాలా మంది ఇళ్ల నిర్మాణం చేపట్టకుండా స్థలాలను ఖాళీగా వుంచేశారు. ఈ స్థలాలతోపాటు లేఅవుట్లకు ఆనుకొని వున్న ఖాళీ స్థలాలను కొంతమంది స్థానికులు ఆక్రమించేస్తున్నారు. అనకాపల్లి మండలం గొలగాం, సంపతిపురం, తగరంపూడి, సీతానగరం, జగన్నాథపురం గ్రామాల్లో ఈ తరహా ఆక్రమణలు అధికంగా జరిగాయి. అయితే సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. విలువైన ప్రభుత్వ భూములను కాపాడడానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ భూముల రక్షణపై నెలకు ఒకసారైనా మండల స్థాయిలో సమీక్ష జరపాలని ప్రజలు కోరుతున్నారు.

రూటు మారిన గంజాయి

... 3వ పేజీ తరువాయి

తనిఖీ చేసి పట్టుకుంటున్నారు. ఇక ఎటువంటి సమాచారం రాకుండా తరలిపోతున్న గంజాయి పెద్ద మొత్తంలోనే వుంటున్నదన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. దీంతో గంజాయి రవాణాదారులు గరికబంద చెక్‌పోస్టు మీదుగా కాకుండా, నాలుగు ఇతర మార్గాల్లో గంజాయిని తరలిస్తున్నట్టు తెలిసింది.

పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి వచ్చే మార్గంలో 12వ మైలురాయి నుంచి కక్కికందులపాలెం రోడ్డు, చీడికాడ మండలం కోనాం ప్రాంతానికి తరలిస్తున్నారు. అక్కడ నుంచి దేవరాపల్లి, కె.కోటపాడు, సబ్బవరం మార్గాల్లో జాతీయ రహదారి చేరువలోకి చేర్చి, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇక పాడేరు మండలంలోని దేవాపురం మీదుగా మాడుగుల సమీపంలోని కొన్ని ప్రాంతాలకు చేర్చి నిల్వ ఉంచి, అక్కడ నుంచి ఆటోలు లేదా కార్లతో రవాణా చేస్తున్నారు. ఈ రెండు మార్గాలతోపాటు, హుకుంపేట మండలం నుంచి రైవాడ మీదుగా మైదానప్రాంతానికి నడకదారిలో గంజాయి తరలిస్తున్నట్టు చెబుతున్నారు. ఇంకా జి.మాడుగుల మండలం నుంచి వి.మాడుగుల మండలంలోని జాలంపల్లి, కింతలి ప్రాంతాల మీదుగా బుచ్చెయ్యపేట, రావికమతం మండలాలకు చేరుకుని, అక్కడ పొలాల్లో, పాకల్లో గంజాయిని నిల్వ చేస్తున్నారు. ఇక్కడి నుంచి ట్రాక్టర్లు, ఆటోలు, కార్లతో తరలిస్తున్నట్టు సమాచారం. మాడుగుల మండలంలోని శంకరం, రావిపాలెం తదితర ప్రాంతాల నుంచి కూడా మైదాన ప్రాంతానికి గంజాయిని తీసుకువస్తున్నారు. ఏజెన్సీ వైపు నుంచి గంజాయి రవాణాను పూర్తిగా కట్టడి చేయాలంటే ఆయా మార్గాల్లో కూడా చెక్ పోస్టులను ఏర్పాటు చేయాల్సిన అవసరం వుంది. ప్రధానంగా ఏజెన్సీని ఆనుకొని వున్న చీడికాడ, దేవరాపల్లి, మాడుగుల, రోలుగుంట, రావికమతం మండలాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయడంతోపాటు, నిఘాను మరింత పటిష్ఠం చేస్తే గంజాయి రవాణా పూర్తిగా ఆగుతుందని అభిప్రాయపడుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	115.00
లైవ్ ధర	135.00
విత్ స్కిన్	240.00
స్కిన్ లెస్	250.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	640
విజయనగరం	644
శ్రీకాకుళం	644